


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి బుధవారం 01-06-2022 సంపుటి: 03 సంచిక: 252 పేజీలు: 4 వెల: రూ 3-00


# స్వదేశం చేరుకున్న సీఎం వైఎస్ జగన్





వైఎస్ జగన్‌కు గన్నవరం విమానాశ?రయంలో ప్రజా ప్రతినిధులు, ఉన్నాతాధికారులు స్వాగతం పలికారు. ఇక, వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సమావేశాల్లో రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు మరిన్ని నిర్మాణాత్మక పునాదులు పడ్డాయి. అభివృద్ధిని, పర్యావరణ హితాన్ని సమతుల్యం చేసుకుంటూ పారిశ్రామికంగా రాష్ట్రాన్ని శక్తివంతంగా నిలిపేందుకు సీఎం జగన్ నేతృత్వంలో రాష్ట్రం దావోస్ వేదికగా చక్కటి ఫలితాలు సాధించింది. రేపటి ప్రపంచంతో పోటీపడుతూ, సుస్థిర ఆర్థికాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ఈ వేదికను చక్కగా వినియోగించుకుంది. విఖ్యాత సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు రాష్ట్రంతో అవగాహన కుదుర్చుకున్నారు.



దావోస్ వేదికగా వరల్డ్ ఎకానమిక్ ఫోరమ్ సదస్సు జరిగిన విషయం తెలిసిందే. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు మంత్రులు పాల్గొన్నారు. కాగా, దావోస్ పర్యటనను విజయవంతంగా ముగించుకుని సీఎం జగన్, మంత్రుల బృందం మంగళవారం స్వదేశానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఎం

# జాతీయ హరిత ధర్మాసనం ఉత్తర్వులపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఏపీ ప్రభుత్వం..

## గ్రీన్ ట్రైబ్యునల్ తీరుపై సుప్రీం ఆశ్చర్యం

న్యూఢిల్లీ: చట్ట సభ్యుల దాఖలు చేస్తున్న లెటర్ పిటిషన్లను జాతీయ హరిత ధర్మాసనం విచారిస్తుండడంపై సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. కోర్టులను ఆశ్రయించలేని వారి కోసమే ఎన్‌జీటీ అధికార పరిధి ఉందని భావిస్తున్నట్టు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ హిమా కోహ్లీతో కూడిన వెకేషన్ బెంచ్ పేర్కొంది. "ఏంటిది? పార్లమెంటు సభ్యుల లేఖలను కూడా జాతీయ హరిత ధర్మాసనం విచారిస్తోంది. కోర్టులను ఆశ్రయించలేని వారి కోసమే ఎన్‌జీటీ పరిధి ఉందని భావించాం. అది ఉన్నది సాధారణ పౌరులకే కానీ చట్ట సభ్యులకు కాదు" అని ధర్మాసనం స్పష్టం చేసింది.రిషికొండలో సీఆర్‌జడ్ నిబంధనలను నిర్మాణ పనులు చేపట్టిన ప్రాజెక్టు ఉల్లంఘించిందంటూ ఎంపీ రఘురామ కృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన గ్రీన్ ట్రైబ్యునల్ నిర్మాణ పనులను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ అప్పీలుపై విచారణ




సందర్భంగా కోర్టు పై వ్యాఖ్యలు చేసింది. ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపిస్తూ.. ఇది పర్యాటక రంగం కోసం ఒక ముఖ్యమైన ప్రజా ప్రయోజన ప్రాజెక్టు అని కోర్టుకు తెలిపారు. 300 మందికిపైగా ఉపాధి అవకాశాలు లభించాయని, రూ. 180 కోట్ల పెట్టబడులు వచ్చాయని పేర్కొన్నారు. దీంతో కల్పించుకున్న సుప్రీంకోర్టు బెంచ్.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 227 ప్రకారం ఎన్‌జీటీ, హైకోర్టుకు అధీనంలో ఉన్న ట్రైబ్యునల్ అని చెబుతున్న తీర్పు కాపీ ఉందా? అని అభిషేక్‌ను ప్రశ్నించింది.అయితే, దీనికి తనకు కొంత సమయం కావాలని సంఘ్వీ కోరారు. దీంతో తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది. కాగా, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కేసులను సమర్థంగా, త్వరితగతిన పరిష్కరించేందుకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చట్టం 2010 ప్రకారం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేశారు.

# 2024 ఎన్నికలే చంద్రబాబుకు చివరివి: మంత్రి పెద్దిరెడ్డి

అనంతపురం: అనంతపురంలో సామాజిక న్యాయభేరి సభ విజయవంతమైందని మంత్రి



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. సామాజిక న్యాయభేరి సభకు మహానాడుకి మించి ప్రజలు వచ్చారన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి గత ఎన్నికలకు మించి సీట్లు వస్తాయన్నారు. కుప్పంలో మైనింగ్ మాఫియా జరుగుతోందని చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. కేవలం ఎన్నికల అస్త్రంగా చంద్రబాబు మాట్లాడుతున్నారన్నారు. 2024 ఎన్నికలే చంద్రబాబుకు చివరివని మంత్రి పెద్దిరెడ్డి వ్యాఖ్యానించారు.

# 2019లో బాలకృష్ణ కూడా తొడలు కొట్టాడు.. ఏమైంది..?: మంత్రి జోగి రమేష్

తాడేపల్లి: సామాజిక న్యాయ భేరీ యాత్రలో శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకూ లక్షల మంది ఘన స్వాగతం పలికారని గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఈ మేరకు తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. '16 జిల్లాల గూండా సాగిన బస్సు యాత్రకు జయహో జగనన్న అంటూ ప్రజలు నినదించారు. 75 ఏళ్ల చరిత్రలో సామాజిక న్యాయం పాటించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్. మూడేళ్ల కాలంలో సామాజిక న్యాయం ఏ విధంగా ఉంటుందో చేసి చూపించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలో ఒక ఆలోచన, కృతజ్ఞతా భావం పెరిగింది. ప్రజల మనసుల్లో పెద్దఎత్తున జగనన్న మంచి స్థానం కల్పించుకున్నారని మాకు



యాత్రలో స్పష్టంగా తెలిసిందని మంత్రి జోగి రమేష్ పేర్కొన్నారు. 'చంద్రబాబు ఒక మాయలపకీరులా మహానాడును తిట్ల పురాణంతో నిర్వహించాడు. అయ్యన్నపాత్రుడు తాగొచ్చి మాట్లాడుతున్నాడా...?. బలహీన వర్గాలు టీడీపీకి పట్టుకొమ్మ అన్నమాట పటాపంచలు అయ్యింది. జ్యోతిరావు పూలే ఆశయాలను ఆచరణలో పెట్టిన అభినవ పూలే వైఎస్ జగన్. నామినేటెడ్ పదవులు, వర్క్‌లలో 50 శాతం మాకు అందించాడు. 25 మంది మంత్రుల్లో 17 మంది బడుగు బలహీన వర్గాల వారే. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అయితే సామాజిక న్యాయ నిర్ణేత వైఎస్ జగన్' అని మంత్రి జోగి రమేష్ అన్నారు. నువ్వేరోజైనా బీసీలకు రాజ్యసభ ఇచ్చావా..?నువ్వు మహానాడులో బీసీలకు ఏమి చేశావో చెప్పలేక బూతు పురాణం అందుకున్నావు. మేము బీసీలకు ఏమి చేశామో స్పష్టంగా చెప్తున్నాం. మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పదవికే చెప్పులరిగేలా తిరిగే రోజు నుంచి రాజ్యసభ స్థాయికి బీసీలను ఆదరించారు. నువ్వేరోజైనా బీసీలకు రాజ్యసభ ఇచ్చావా..?. వర్ల రామయ్యకు ఇస్తానని నీ సామాజిక వర్గానికి ఇవ్వలేదా. 2019లో బాలకృష్ణ కూడా తొడలు కొట్టాడు.. ఏమైంది..?. ప్రజలంతా జగనే కావాలి.. జగనే రావాలి అని ముక్తకంఠంతో కోరుతున్నారు. ఇక్కడి సామాజిక న్యాయాన్ని ఇతర రాష్ట్రాల్లో అమలు చేసేలా డిమాండ్స్ వస్తున్నాయి. ప్రజావ్యతిరేకత ఈ ప్రభుత్వంపై ఎందుకుంటుంది..?. 1.40 లక్షల కోట్ల రూపాయలు సీఎం టు సీఎం (కామన్ మ్యాన్)కి వెళ్లాయి. మధ్యలో ఎవరైనా ఉన్నారా.. మీలా జన్మభూమి కమిటీలు ఉన్నాయా..?. రైతన్నలకు రైతు భరోసా సకాలంలో ఇస్తుంటే ఎక్కడుంది వ్యతిరేకత..?. 31 లక్షల మందికి ఇళ్ళ స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టిస్తుంటే వ్యతిరేకత ఉంటుందా...?. మంత్రివర్గంలో 75 శాతం బడుగు బలహీనులకు మంత్రి పదవులు ఇస్తే వ్యతిరేకత వస్తుందా...?. మేధావులు అందరూ ఆలోచన చేస్తున్నారు.. ఇలాంటి సామాజిక న్యాయం ఎన్నడూ చూడలేదని అంటున్నారు. 2019లో మాకు వ్యతిరేకంగా పనిచేసిన వారు కూడా 2024లో మాకు అండగా పనిచేసెందుకు సిద్దంగా ఉన్నారు. గ్రామ స్వరాజ్యం కోసం మహాత్మా గాంధీ కలలు కంటే.. జగన్ నిజం చేసి చూపించారు.

# కుల్గామ్‌లో ఉగ్రవాదుల కాల్పులు..

## ఉపాధ్యాయురాలు మృతి



శ్రీనగర్ : జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. కుల్గామ్ జిల్లా లోని గోపాల్‌పొరా ప్రాంతంలో హైస్కూల్ ఉపాధ్యాయురాలిపై కాల్పులు జరిపారు. కాల్పుల్లో తీవ్రంగా గాయపడగా.. ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మరణించారు. సమా చారం అందుకున్న భద్రతా బలగాలు, పోలీసుల బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఈ ప్రాంతాన్ని చుట్టుముట్టి ఉగ్రవాదుల కోసం సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించాయి. మృతురాలిని రజనీ భల్లాగా గుర్తించారు.రజనీ జమ్మూ డివిజన్‌లోని సాంబా జిల్లా నివాసి. కాల్పులకు తెగబడ్డ వారిని త్వరలోనే గుర్తించి, మట్టుబెడుతామని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనపై మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాగ్ర్భ్భంతి వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. రెండు రోజుల కిందట టీవీ నటిపై ఉగ్రవాదులు కాల్పులు జరపగా.. తీవ్ర గాయాలతో మృతి చెందింది. అంతకు ముందు వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారే లక్ష్యంగా ముష్కరులు కాల్పులు జరిపారు.మరో వైపు లక్షిత దాడులు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు, భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి అవంతిపొరా ప్రాంతంలోని రాజ్‌పొరా ప్రాంతంలో ఎన్‌కౌంటర్ చోటు చేసుకున్నది. ఈ ఘటనలో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. అంతకు ముందు ఆదివారం, సోమవారాల్లో ఇద్దరు జైషే ఉగ్రవాదులను బలగాలు మట్టుబెట్టాయి.

## రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన సీఎస్ సోమేశ్ కుమార్

హైదరాబాద్ మే 31 జూన్ 2 వ తేది రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ మంగళవారం పరిశీలించారు. జరగనున్న ఈ వేడుకలకు సంబంధించి పూర్తి డ్రెస్ రిహార్సల్‌ను కూడా వీక్షించారు. తెలంగాణ రాష్ట్రఆవిర్భావ దినోత్సవా న్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు జాతీయ జెండాను ఆవిష్కరించ నున్నారు. ఈ సందర్భంగా గన్ పార్క్ వద్ద ఉన్నతెలంగాణ అమరవీరులస్థూపంవద్ద అమరవీ రులకు నివాళులర్పిస్తారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, మున్సిపల్ కమిషనర్ లోకేష్ కుమార్, దానకిషోర్, ప్రొటోకాల్ అడిషనల్ సెక్రటరి అరవిందర్ సింగ్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు, సంబంధిత విభాగ అధికారులు పాల్గొన్నారు.

# ఏపీలో డీజిల్, పెట్రోల్ కొనుగోళ్ల నిలిపివేత




అమరావతి: ఏపీలో డీజిల్, పెట్రోల్ కొనుగోళ్లను నిలిపివేశారు. పెట్రో కొనుగోళ్లను బంకుల యాజమాన్యాలు నిలిపివేశారు. బంకుల డీలర్లకు 2017 నుంచి కమీషన్ పెంచకపోవడంతో ఆందోళనకు వ్యక్తం చేశారు. ఏపీలోని 4వేల పెట్రోల్ బంకులకు గానూ 2వేల బంకుల్లో రోజూ కొనుగోళ్లు జరుగుతుంది. ఆయిల్ కంపెనీలకు ముందే పెట్రోల్ డీలర్స్ అసోసియేషన్ నోటీసులిచ్చింది. అలాగే ఆయిల్ కంపెనీలు దిగిరాకపోతే బంకులు మూస్తామని హెచ్చరించింది.

# కార్గో రవాణలో విశాఖ పోర్టుకి అగ్ర స్థానం

## కేంద్రమంత్రి సోనోవల్

విశాఖపట్నం విశాఖపట్నం పోర్టు వ్యాపార లావాదే వీల్లో చరిత్ర సృష్టిస్తోందని కేంద్ర షిప్పింగ్, జల రవాణా, ఆయుష్ శాఖా మంత్రి సర్బానంద సోనోవల్ వెల్లడించారు. దేశంలోని పోర్టుల ప్రగతిపై వివరించిన ఆయన ఇండియాలోని పోర్టుల్లో వైజాగ్ పోర్టు కార్గో హ్యాండ్లింగ్‌లో అగ్ర స్థానంలో ఉందన్నారు. గతిశక్తి పథకం ద్వారా 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ మోడీ 2035 నాటికి లక్ష్యంగా పెట్టుకున్నార న్నా రు. దేశంలోని మేజర్ పోర్టుల్లో 2014లో 16 మిలియన్ టన్నుల కార్గో హ్యాండ్లింగ్ ఏటా జరిగితే 2022 నాటికి 105 మిలియన్ టన్నులకు చేరుకోగలి గామన్నారు. కార్గో హ్యాండ్లింగ్‌లో ఇండియా చాలా వేగంగా వృద్ధి సాధిస్తుందని తెలిపారు. సాగర మాల ప్రాజెక్ట్ ద్వారా ఏపీ పోర్టులను ఆధునికీకరిస్తున్నామన్నారు. సాగర మాల అనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమ్మేళనంతో పని చేస్తోందని, పోర్టుల అభివృద్ధి కోసం ఇది నడుస్తుందని చెప్పారు. త్వరలోనే విశాఖపట్నం నుంచి సీ -క్రూజ్ షిప్పింగ్ ప్రారంభిస్తామని తెలిపారు. విశాఖపట్నం గ్లోబల్‌సిటీగా మారుతున్న నేపథ్యంలో టూరిజం పరంగా అభివృద్ధి చెయ్యడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో ఎమ్‌డి విక్టర్ నియామకం గురించిన వివాదంలో అంతర్గత విచారణ జరుగుతుందని చెప్పారు.

# గ్రీన్ ఎనర్జీ.. ఏపీ ఒక దిక్సూచి కాబోతుంది: మంత్రి అమర్‌నాథ్

విశాఖపట్నం: ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను దావోస్ సదస్సులో వివరించామని పరిశ్రమలు ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. పలు సంస్థల ప్రతినిధులతో చర్చించామని తెలిపారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, స్టార్టప్ కంపెనీలతో ప్రత్యేక మీటప్ నిర్వహించామన్నారు. ప్రపంచస్థాయి వేదికలపై సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన రాష్ట్ర ప్రగతిని ఫోకస్ చేశామన్నారు. ఐదు రోజుల సదస్సుకు సంబంధించి ఒక పెవిలియన్ ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు.గీన్ ఎనర్జీపై ప్రత్యేక దృష్టి సారించామని మంత్రి పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీలో దేశానికి ఏపీని ఆదర్శంగా మారుస్తున్నామన్నారు. గ్రీన్ ఎనర్జీ విషయంలో ఏపీ ఒక దిక్సూచి కాబోతుందన్నారు. 30 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఏపీలో అవకాశాలు ఉన్నాయన్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలతో ఎంవోయూలు చేసుకున్నామని మంత్రి అమర్‌నాథ్ వెల్లడించారు.



# సంపాదకీయం

బుధవారం 01-06-2022

## శ్రీలంక పాఠాలతో మార్పు వస్తుందా

పాలనలో మితిమీరిన బంధుప్రీతి, విపరీత ఉచిత హామీలు కూడా ప్రమాదమేనని శ్రీలంక పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి. లౌకిక, ప్రజాస్వామ్య విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలి. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. శాస్త్రీయ దృక్ఫథం ఉండేలా చూడాలి. రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులకు రక్షణ కల్పించాలి. కుల, మత, ప్రాంతీయ, భాషా, లింగ భేదాలు లేకుండా 'భిన్నత్వంలో ఏకత్వం' అనే భావనను పెంపొందించాలి. ఏడు కోట్ల జనాభా ఉన్న ఫ్రాన్స్ మనకు 'రాఫెల్' యుద్ధ విమానాలు అమ్ముతున్నది. విపరీత ఉచిత హామీలు కూడా ప్రమాదమేనని శ్రీలంక పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి. లౌకిక, ప్రజాస్వామ్య విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలి. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. శాస్త్రీయ దృక్ఫథం ఉండేలా చూడాలి. రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులకు రక్షణ కల్పించాలి. కుల, మత, ప్రాంతీయ, భాషా, లింగ భేదాలు లేకుండా 'భిన్నత్వంలో ఏకత్వం' అనే భావనను పెంపొందించాలి. ఏడు కోట్ల జనాభా ఉన్న ఫ్రాన్స్ మనకు 'రాఫెల్' యుద్ధ విమానాలు అమ్ముతున్నది. మనం ఇంకా మత మూఢాచారాలు పట్టుకుని వేలాడుతున్నాం. ఆలోచన చేయండి. వియత్నాం, ఇజ్రాయెల్ దేశాల వలే అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తూ ముందుకు సాగితేనే మంచిది. ఉగ్రవాదానికి చెక్ పెట్టగలం.ద్రవ్యాలు ప్రపంచాన్ని మత్తులో ముంచుతుంటే, ఉగ్రవాదం అరాచకాన్ని, అల్లకల్లోలాన్ని సృష్టిస్తున్నది. ప్రపంచంలో సగానికి పైగా దేశాలు ఉగ్రవాద దాడులతో సతమతం అవుతున్నాయి. రాజ్యాధినేతల నుంచి సామాన్యుల దాకా ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. అన్ని దేశాలు ఐక్యతగా ఈ సమస్య పరిష్కారం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేయాలి. మొదట మతాల మధ్య ప్రారంభమైన ఉగ్రవాద స్వభావం తదుపరి అనేక రూపాలను సంతరించుకుంది. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఫ్రాన్స్‌లో ప్రారంభమైన ఉగ్రవాద దాడులు 1970 దశకం నుంచి ప్రపంచమంతా మత, రాజకీయ, ప్రాంతీయ భావజాలంతో విస్తరించాయి.ఉగ్రవాదులు సామాన్య ప్రజలు, ఆస్తులు, ప్రభుత్వాలపై విరుచుకుపడి, ప్రాణ, ఆస్తి నష్టాలకు కారణం అవుతున్నారు. ఇదే క్రమంలో భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీని ఎల్‌టీటీఈ ఆత్మాహుతి దళాలు 31 సంవత్సరాల క్రితం 1991 మే 21న బలి తీసుకున్నాయి. ఆయన మరణించిన రోజునే ఉగ్రవాద వ్యతిరేక దినంగా జరుపుకుంటున్నాం. ఉగ్రవాదం ప్రపంచ అంతా ఒకరకంగా ఉంటే, మన భారతదేశంలో ఇస్లామిక్, వేర్పాటువాదంలా విస్తరించి ఉంది. సౌత్ ఏషియాలో, సహారా ఆఫ్రికాలో 48 శాతం ఉగ్రవాద దాడులు జరిగాయి. గ్లోబల్ టెర్రరిస్టు ఇండెక్స్-2021 ప్రకారం అఫ్ఘానిస్తాన్, ఇరాక్, సిరియా, మయన్మార్, సాహెల్ ప్రాంతాలు, బుర్కినా ఫాసో, డీఆర్‌సీ (కాంగో), మాలీ, నైజర్ ఉగ్రవాదంలో ముందంజలో ఉన్నాయి. భారతదేశం 12వ స్థానంలో ఉంది. 2021లో ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద దాడులతో 7,142 మంది మరణించారు. జేఎన్ఐఎం అనే ఉగ్రవాద సంస్థ 351 మంది మరణాలకు కారణం అయింది. ఈ సంస్థ కాబూల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో జరిపిన దాడిలో 170 మంది మరణించగా, 200 మంది గాయపడ్డారు. ఇరాక్‌లో 524 మంది ఉగ్రవాద దాడులలో మరణించారు. ఐసిస్ ఉగ్రవాదులు 2021లో యూరప్ ఖండంలో మొత్తం 113 దాడులు చేశారు.ఉగ్రవాద దాడులు 1975లో మొదలయ్యాయి. అప్పుడు త్రిపురలో నలుగురు మృతిచెందారు. 1980లో 500 మంది మరణించారు. 1992లో 1,115 మంది ఉగ్రవాదానికి బలయ్యారు. 1999లో ఇస్లామిక్ తీవ్రవాదులు ఎయిర్ ఇండియా విమానాన్ని అఫ్ఘానిస్తాన్‌లోని ఖాందహార్‌కు మళ్లించారు. 1998 కోయింబత్తూర్ అల్లర్లు, 26/11 బొంబాయి పేలుళ్లు, 2001లో భారత పార్లమెంటుపై దాడి, 2007లో గోకుల్‌ఛాట్, దిల్‌సుఖ్‌నగర్ బాంబు దాడులు, 2019 పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు మీద దాడులో 46 మంది మృతి, 2021 ఏప్రిల్ మొదటి వారంలో ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల దాడిలో 22 మంది పోలీసుల మరణం మన కండ్ల ముందు కదలాడుతూనే ఉన్నాయి. అనేకమంది గాయపడ్డారు. అనేక కుటుంబాలకు దిక్కు లేకుండా పోయింది. ఆయా దాడులకు లష్కరే తోయిబా, జైషే మహమ్మద్, మావోయిస్టు, తాలిబాన్ వంటి 42 సంస్థలను ప్రధాన సూత్రధారులుగా గ్రహించి నిషేధం విధించింది భారతదేశం. జమ్ము-కాశ్మీర్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాలలో ఎక్కువగా ఉగ్రదాడులు జరుగుతున్నాయి. మన ప్రభుత్వం 'సర్జికల్ స్ట్రైక్' చేసి ఉగ్రవాదులకు బుద్ధి చెప్పింది. ఉగ్రవాద దాడులతో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక పరంగా 2019లో 26.4 అమెరికన్ బిలియన్ డాలర్లు నష్టం వాటిల్లగా, 2019లో భారత దేశం 16 శాతం ఆర్థిక క్షీణత చవిచూసింది.కొవిడ్-19 నేపథ్యంలో ఉగ్రవాద కార్యకలాపాలు, మరణాలు తగ్గుముఖం పట్టాయి. కానీ, కొత్త ఉగ్రవాద సంస్థలు పుట్టుకొచ్చాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మరో సవాల్ విసురుతోంది. ఈ సమయంలో ప్రతీ దేశం శాంతి వైపు ప్రయాణం చేయాలి. విద్య, ఉపాధి కల్పన ద్వారా ఉగ్రవాద కట్టడికి కృషి చేయాలి. ఐక్యరాజ్య సమితి చొరవ తీసుకుని మత ఛాంధసవాదాన్నిపెంచి పోషించే సంస్థలు, దేశాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. అమెరికాలో చెలరేగుతున్న జాతి వివక్ష (బ్రీత్ మి) సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలి. ఇతర దేశాల ఆంతరంగిక విషయాలలో జోక్యం చేసుకోకూడదు. మనం ఇంకా మత మూఢాచారాలు పట్టుకుని వేలాడుతున్నాం. ఆలోచన చేయండి. వియత్నాం, ఇజ్రాయెల్ దేశాల వలే అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తూ ముందుకు సాగితేనే మంచిది. ఉగ్రవాదానికి చెక్ పెట్టగలం.

# వెల్లంపల్లి సీన్ సితార అవుతోందా...



విజయవాడ, మే 31, జగన్ పార్టీ పరిస్థితి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ వరకూ ఒకెత్తు.. ఆ తరువాత మరొక ఎత్తు అన్నట్లు తయారైందన్నది రాజకీయ పండితుల పరిశీలన. అంటే పార్టీ బలపడిందని కాదు.. పార్టీ ప్రతిష్ట దిగజారే వేగం పెరిగిందని వారు విశ్లేషిస్తున్నారు. ఒక్కొక్కటిగా మంత్రుల నియోజకవర్గాలలో పరిస్థితిని గమనిస్తే ఆ సంగతి స్పష్టమౌతుందని వారు చెబుతున్నారు.విజయవాడ పశ్చిమ నియోజవకర్గం సంగతే తీసుకుంటే గత ఎన్నికలలో ఈ నియోజకవర్గం నుంచి విజయం సాధించి మంత్రి పదవి చేపట్టిన వెల్లంపల్లి శ్రీనివాస్ పార్టీలోనే కాదు, నియోజకవర్గంలో కూడా ఏకాకిగా మారారు. సొంత వర్గీయులు కూడా దూరం జరిగి ఆయనపై విమర్శల వర్షం కురిపిస్తున్నారు. గత ఎన్నికలలో బొటాబొటీ మెజారిటీతో విజయం సాధించిన వెల్లంపల్లి మంత్రిగా అందులోనూ ప్రభుత్వంలో పలుకుబడి మెండుగా కలిగిన నేతగా నియోజకవర్గంలో మూడేళ్ల పాటు చక్రం తిప్పారుఆ క్రమంలో తన నోటి దురుసుతో, దుందుడుకు వ్యవహార శైలితో ప్రజలలోనే కాకుండా, సొంత పార్టీ క్యాడరల్ లోనూ వ్యతిరేకత మూటగట్టుకున్నారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఆయన హయాంలో దేవాలయాలలో చోరీలు, విగ్రహాల ధ్వంసం వంటికి జరిగాయి. అంతర్వేదిలో రథం దగ్ధం సంఘటన తరువాత ఆయన ప్రతిష్ట బాగా దిగజారింది. ఆలయాలపై దాడులు, చోరీల ఘటనలను నివారించడంలో.. వాటికి కారకులను పట్టుకుని శిక్షించడంలో ప్రభుత్వ వైఫల్యం ప్రభావం ఆయనపై జన బాహుల్యంలో ప్రతికూలత ను పెంచింది. ఊరు మంచిదైతే నోరు మంచిది అవుతుందంటారు. జగన్ సర్కార్ తొలి కేబినెట్ మంత్రులలో కొడాలి నాని, పేర్ని నానిల తరువాత విపక్షంపై నోరేసుకు పడిపోయే మంత్రిగా వెల్లంపల్లి శ్రీనివాస్ గుర్తింపు పొందారు. విపక్షంపై ఆయన దూకుడు కారణంగానే విజయవాడలో ఆయనేం చెబితే అదే నడిచేది. బెజవాడ కార్పొరేషన్ వైసీపీ గెలుచుకోవడానికి ఆయనే కారణమన్న బిల్డప్ ఉంది. అందుకే మేయర్ పదవి వెల్లంపల్లి సామాజిక వర్గానికే చెందిన రాయన భాగ్యలక్ష్మికి ఆయన సిఫారసుపైనే దక్కిందని అప్పట్లో పార్టీ వర్గాలే కాదు ఆయనే స్వయంగా చెప్పుకున్నారు. అలాగే బెజవాడ కకన దుర్గమ్మ గుడి చైర్మన్ పదవి కూడా ఆయన సామాజిక వర్గానికే చెందిన పైలా సోమినాయుడిని వరించడంలో కూడా తన పాత్రే ఉందని వెల్లంపల్లి చెప్పుకున్నారు. మంత్రిగా ఉన్నంత కాలం వెలిగిపోయిన ఆయన ప్రభ మాజీ కాగానే మసక బారింది. మంత్రిగా ఉన్నంత కాలం ఆయన వర్గీయులుగా ముద్ర పడిన వారంతా కారణాలేవైనా ఇప్పుడాయనకు దూరం జరిగారుమంత్రిగానూ, మాజీ మంత్రిగానూ కూడా ఆయనే పెత్తనం చెలాయిస్తానంటే కుదరదంటూ ఎదురు తిరుగుతున్నారు. అంతేనా వెల్లంపల్లి తీరుపై అసంతృప్తితో కార్పొరేటర్లు రాజీనామా హెచ్చరికలు చేస్తున్నారు. ఇప్పుడు నియోజకవర్గంలో ఆయన దాదాపు ఏకాకిగా మారిపోయారని చెప్పుకోవచ్చు. ఈ నేపథ్యంలోనే ఆయన గత ఎన్నికలలో విజయం సాధించినా, మరో సారి గెలిచే పరిస్థితి ఉందా అన్న చర్చ పార్టీ వర్గాలలోనే బయలు దేరింది. గత ఎన్నికలలో ఆయను 58 వేల ఓట్లు వస్తే, ఆయన ప్రత్యర్థి, తెలుగుదేశం అభ్యర్థి అయిన ఖలీల్ ఖాన్ కుమార్తె షబానా ఖాతూన్ కు 50 వేల ఓట్లు వచ్చాయి. ఇదే నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా రంగంలో నిలిచిన పోతిన మహేష్ కు ఇరవై రెండు వేల ఓట్లు వచ్చాయి.ఇప్పుడు తెలుగుదేశం, జనసేన పొత్తు ఉంటుందని భావిస్తున్న తరుణంలో నియోజకవర్గంలో వ్యతిరేకత మూటగట్టుకున్న వెల్లంపల్లి శ్రీనివాస్ కు టికెట్ ఇచ్చే సాహసానికి జగన్ ఒడికట్టరని పార్టీ వర్గాలే చెబుతున్నాయి. దీంతో ఈ మాజీ నియోజకవర్గంలో పట్టు కోసం తనను వ్యతిరేకిస్తున్న వైసీపీ క్యాడర్ ను, నాయకులను మచ్చిక చేసుకోవడానికి చెమటోడుస్తున్నారట. వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు కూడా అయిన వెల్లంపల్లి నియోజకవర్గంలో నేతల మధ్య సమన్వయం సాధించడం అటుంచి, తనపై పార్టీ క్యాడర్ లో ఉన్న వ్యతిరేకతను అధిగమించేందుకే సమయం అంతా కేటాయిస్తున్నారని పార్టీ వర్గాలు సెటైర్లు వేసుకుంటున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పార్టీకి సమయం కేటాయించడం లేదనీ, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఎన్టీఆర్ జిల్లాలో వైసీపీ మరింత బలహీన పడుతుందనీ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# మళ్లీ టీడీపీకి గూటికి రేణుకా



కర్నూలు మే 31,కర్నూలు మాజీ ఎంపీ బుట్టా రేణుక.. కొంతకాలంగా వైసీపీ కార్యక్రమాల్లో అంటీముట్టనట్టు ఉంటున్నారట. కర్నూలు ఎంపీగా ఉన్నపుడు నిత్యం ప్రజల్లో ఉన్న బుట్టా రేణుక.. కరోనా పూర్తిగా తగ్గిపోయాక కూడా యాక్టివ్‌గా లేకపోవడంపై రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోందట. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నా.. తన రాజకీయ భవిష్యత్‌పై ఒక నిర్ణయం తీసుకునే ఆలోచనలో ఉన్నారట బుట్టా రేణుక. ఎమ్మిగనూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే ఆలోచనలో ఉన్న రేణుక.. సీటు ఖరారు చేయాలని వైసీపీ అధిష్టానాన్ని కోరారట. అయితే ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి వైసీపీ ఆవిర్భావం తరువాత.. సిట్టింగ్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికలను ఎదుర్కొన్నారని, ఆ స్థానాన్ని బుట్టా రేణుకకు ప్రకటించేందుకు వైసీపీ అధిష్టానం అంగీకరించలేదట. రాబోయే రోజుల్లో ఎమ్మెల్సీ వంటి పదవిపై ఆలోచిస్తామని చెప్పారట. దీంతో రాజకీయ భవితవ్యంపై ఆలోచనలో పడ్డారని సమాచారం.వాస్తవంగా బుట్టా రేణుక అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చారు. ఏకంగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2014 ఎన్నికలకు కొన్ని నెలల ముందు వైసీపీలో చేరి.. కర్నూలు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి గెలిచారు. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చినా.. ఎంపీగా నియోజకవర్గంలో కలియ తిరుగుతూ వైసీపీ ఎమ్మెల్యేలకు దన్నుగా నిలిచారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న ఎమ్మెల్యేలకు నిధులు రాకపోవడంతో ఎంపీ నిధులతోనే అంతో ఇంతో పనులు చేశారనే ప్రచారం ఉంది. మూడేళ్ళ తరువాత వైసీపీ నుంచి టీడీపీకి జింప్ అయ్యారు. అయితే టీడీపీ ఎంపీ టికెట్ ఇవ్వకపోవడంతో.. 2019 ఎన్నికల ముందు తిరిగి వైసీపీ గూటికి చేరారు. అయితే వైసీపీ నుంచి బయటికి వెళ్లి రావడం ఆమెకు మైనస్ అయింది. తిరిగి వైసీపీ గూటికి చేరినా.. బుట్టా రేణుకకు ప్రాధాన్యత లభించలేదు. ఎన్నికల సమయంలో టికెట్ రాకపోవడంతో.. సొంతగూటికి చేరుకున్న బుట్టా రేణుక.. ఈసారి అలాంటి తప్పు చేయకూడదని అనుకున్నట్లు ఉన్నారు. తన రాజకీయ భవిష్యత్‌పై..ముందుగా మేలుకోవాలనుకున్నారట. అందుకనే ఎమ్మిగనూరు వైసీపీ టికెట్ కోసం ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఇప్పుడు వైసీపీ పెద్దలు.. ఆ టికెట్ ఇచ్చే ఉద్దేశం లేదనే సంకేతాలు ఇవ్వడంతో.. ప్రత్యామ్నాయం చూసుకునే ఆలోచనలో ఉన్నారట. వైసీపీలో కార్యక్రమాలకు ఎంపీలు, ఎమ్మెల్యేల నుంచి ఆహ్వానం కూడా ఉండటం లేదనే అసంతృప్తి కూడా బుట్టా రెణుకలో ఉందట. ఎమ్మిగనూరులో చేనేత సామాజిక వర్గం ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. బుట్టా రేణుక ఆ సామాజికవర్గానికి చెందిన నాయకురాలు. దీంతో అక్కడి నుంచి పోటీకి పావులు కదుపుతున్నారనే ప్రచారం ఉంది. మహానాడులోనే టీడీపీ కండువా కప్పుకుంటారనే ప్రచారం జరిగింది. ఈ ప్రచారంపై వైసీపీ అధిష్టానానికి సమాచారం ఉన్నా.. పెద్దగా దృష్టి పెట్టలేదంట. అయితే బుట్టా రేణుక మాత్రం ఆ ప్రచారంలో నిజం లేదంటున్నారట. రాజకీయాల గురించి ఆలోచించడం లేదని చెబుతున్నారట. అయితే ఇపుడు కాకపోయినా కొన్నాళ్ల తరువాత అయినా.. పచ్చ కండువా కప్పుకుంటారని కొందరు విశ్లేషిస్తున్నారు. బుట్టా రేణుక టీడీపీ జెండా పట్టుకుంటారో.. ఫ్యాన్ గాలితో సరిపెట్టుకుంటుందో వేచి చూడాలి.

# టీడీపీ వైపు కైవల్య చూపు

నెల్లూరు, మే 31, నెల్లూరు జిల్లా రాజకీయాల్లో అనం కుటుంబానికి ప్రత్యేకత ఉంది. ప్రస్తుతం అనం రామనారాయణ రెడ్డి వెంకటగిరి వై.సి.పి ఎం.ఎల్.ఏగా ఉన్నారు. 1983లో నెల్లూరు నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగానే అనం రామనారాయణ రెడ్డి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 2014 వరకూ కాంగ్రెస్ లో ఉన్న ఆనం..అప్పటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయంతో టిడిపిలో చేరారు. చంద్రబాబు తనకు ప్రాధాన్యం ఇస్తారని భావించారు. కానీ ఏ పదవి కూడా ఇవ్వకపోవడం..కీలక సమావేశాలకు ఆహ్వానించక పోవడంతో కినుకు వహించారు. 2019 ఎన్నికల సమయంలో వై.సి.పి.లో చేరి అనూహ్యంగా వెంకటగిరి నుంచి అసెంబ్లీకి పోటీ చేసి విజయం సాధించారు. వైసీపీలో తనకు ప్రాధాన్యం ఇస్తారని భావించినా.. అది జరగలేదు. తాను రాజకీయాల్లోకి తెచ్చిన అనిల్ కుమార్ యాదవ్ కు మంత్రి పదవి లభించడం అనం కు రుచించలేదు. నెల్లూరు నగర రాజకీయాల్లో గతంలో చురుకైన పాత్ర పోషించిన ఆనం వర్గం.. అనిల్ జోరు ముందు రాజకీయాల నుంచి తాత్కాలికంగా దూరమయ్యారు. అంతేకాకుండా నెల్లూరులో మాఫియా రాజ్యం ఏలుతోందని తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. తీవ్ర అసంతృప్తితో ఉన్న ఆయన.. వచ్చే ఎన్నికల్లో పార్టీ మారుతారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో తమ కుటుంబం నుంచి ఇద్దరు..ముగ్గురు పోటీ చేసే అవకాశం ఉందని గతంలోనే అనం చెప్పారు. ఏ పార్టీ తరపున బరిలోకి దిగుతామనే విషయాన్ని మాత్రం ఆయన స్పష్టం చేయలేదు. ఈ నేపథ్యం లోనే అనం కుమార్తె అనం కైవల్య ..టీడీపి నేత నారా లోకేష్ తో భేటీ కావడం కలకలం రేపింది. మొదటి నుంచి రాజకీయాలపై ఆసక్తి ఉన్న కైవల్య?ఆత్మకూరు నియోజక వర్గం నుంచి బరిలోకి దిగాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగానే లోకేష్ తో సమావేశమైనట్లు తెలిసింది. కైవల్య.. బద్వేలులో ఉన్న మాజీ మంత్రి, టీడీపీ నేత బిజివేముల వీరారెడ్డి కుటుంబంలో కోడలిగా ఉన్నారు. తమ కుటుంబం టిడిపిలో ఉండటంతో తాను కూడా టిడిపి లోకే వెళుతున్నట్లు తన సన్నిహితులతో కైవల్య అంటున్నారుకైవల్య టిడిపి వైపు వెళుతుండటంతో ఎం.ఎల్.ఏ.అనం రామనారాయణ రెడ్డి కూడా ఆ పార్టీలోకి వెళ్లే అవకాశం ఉందని భావిస్తున్నారు. మొదట అనం కైవల్య పార్టీలో చేరుతారని?అనంతరం అనం వెళ్లే అవకాశం ఉందని అంటున్నారు. మొత్తం మీద టిడిపి నేత లోకేష్ తో సమావేశమై జిల్లా రాజకీయాల్లో అనం కైవల్య అలజడి సృష్టించారు.

### బాలినేని శ్రీనివాసరెడ్డికి పొమ్మనలేక.... పొగబెడుతున్నారు...

ఒంగోలు, మే 31,ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి వైసీపీలో పొమ్మనలేక పొగ పెడుతున్నారా అంటే ఆయన వర్గీయులే ఔనని చెబుతున్నారు. ఆ కారణంగానే బాలినేనిలో గతంలో ఉన్నంత ఊపు.. ఉత్సాహం.. కనిపించడం లేదంటున్నారు. ఇటీవల వైయస్ జగన్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన మొక్కుబడిగా పాల్గొనడమే కాకుండా, కొత్తపట్నం మండలంలోని అల్లూరులో బాలినేని జనంపై బూతు పురాణంతో విరుచుకుపడటాన్ని బాలినేనిలో పెరిగిపోయిన ఫ్రస్ట్రేషన్ కు తార్కానంగా చూపుతున్నారు. బాలినేనిని జగన్ కేబినెట్ నుంచి ఉద్వాసన పలకడానికి కారణాన్ని సైతం బాలినేని వర్గీయులు ఆఫ్ ది రికార్డ్ సోదాహరణంగా వివరిస్తున్నారు. బాలినేని డైహార్ట్ ఫ్యాన్ అయిన సుబ్బారావు గుప్తాపై జరిగిన దాడి, అనంతర పరిణామాలతో బాలినేని అంటే నియోజకవర్గంలోని వైసీపీ క్యాడర్ లో భయాందోళలను చోటుచేసుకున్నాయనీ, దీంతో క్యాడర్ ఆయన దగ్గరకు రావడానికే జంకే పరిస్థితి ఏర్పడిందని, అందుకే జగన్ ఆయనను దూరం పెట్టాడనీ వారు చెబుతున్నారు. అంతే కాకుండా వైసీపీ గౌరవాధ్యక్షురాలు, జగన్ తల్లి విజయమ్మ, జగన్ సోదరి షర్మిలతో బాలినేని బంధుత్వం కొనసాగించడం జగన్ ఫ్యామిలీలో అసంతృప్తికి కారణం అవ్వడం కూడా బాలినేని మంత్రి పదవికి ఎసరు రావడానికి కారణమని ఆయన వర్గీయులు చెబుతున్నారు.

# జూన్ 4 నుంచి అమరావతిలో శ్రీ వారి మహాసంప్రోక్షణ

విజయవాడ, మే 31, అమరావతిలో టీటీడీ నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయ మహాసంప్రోక్షణ కార్యక్రమాలు జూన్ 4 నుండి 9వ తేదీ వరకు జరగనున్నాయని, ఇందుకోసం విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టాలని టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. మహాసంప్రోక్షణ ఏర్పాట్లపై సోమవారం తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతి గృహంలో ఈవో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. దూరం నుంచి చూసినా కనిపించేలా ఈ ఆలయం వద్ద శంఖుచక్రనామాలు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వహణకు ఎలాంటి ఆటంకం కలగకుండా పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయాన్ని సులువుగా గుర్తించేలా అవసరమైన ప్రాంతాల్లో సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. జూన్ 9న మహాసంప్రోక్షణ రోజు ఎక్కువ మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో అన్నప్రసాదాలు, తాగునీరు, మరుగుదొడ్లు, షెడ్లు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఆరు రోజుల పాటు జరగనున్న ఆలయ మహాసంప్రోక్షణ కార్యక్రమాలకు తగినంతమంది అర్చక సిబ్బందిని, ఇతర సిబ్బందిని డిప్యూటేషన్‌పై పంపాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా బస తదితర ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరిసరాలను పచ్చని మొక్కలతో సుందరంగా తీర్చిదిద్దాలని కోరారు. మహాసంప్రోక్షణకు ముఖ్యమైన ప్రముఖులు విచ్చేసే అవకాశం ఉండడంతో తగిన భద్రత ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఆలయానికి అవసరమైన ఆభరణాలు అందించాలని సంబంధిత అధికారులను ఈవో ఆదేశించారు. క్యూలైన్ల నిర్వహణ కోసం, భక్తులకు సేవలందించేందుకు శ్రీవారి సేవకుల సేవలను వినియోగించుకోవాలన్నారు. జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని నిర్ణీత సమయంలోపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఈవో ఆదేశించారు

## పోలీసుల చర్యలపై అనుమానాలు

కాకినాడ, మే 31, ఎమ్మెల్సీ అనంత బాబు మాజీ డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య.. ఏపీలో సంచలనం సృష్టించింది. హత్య కేసులో ఎమ్మెల్సీ పైనే అనుమానాలు వ్యక్తం చేశారు డ్రైవర్ కుటుంబ సభ్యులు. అయినా పోలీసులు పట్టించుకోలేదు. కుటుంబసభ్యు లు, దళిత సంఘాల ఆందోళనలతో మూడు రోజులకు.. నాటకీయ పరిణామాల మధ్య ఈనెల 23న అనంత బాబును అరెస్ట్ చేశారు పోలీసులు. అరెస్ట్ విషయంలోనూ పెద్ద సస్పెన్స్ థ్రిల్లర్ క్రియేట్ చేశారు. వైద్య పరీక్షలు, మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచడం అంతా ఎమ్మెల్సీకి అనుకూలంగా చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఎమ్మెల్సీ కి మెజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించారు. వచ్చే నెల 6 వరకు రిమాండ్ లో అయన ఉండనున్నారు. ప్రస్తుతం అనంత బాబు రాజమండ్రి సెంట్రల్ జైలు లో ఉన్నారు. ఇలాంటి కేసుల్లో పోలీసులు వెంటనే కస్టడీ పిటిషన్ వేస్తారు. నిందితుడు మొదట చెప్పిన దానికి.. అదనపు సమాచారం సేకరిస్తారు. కానీ ఈ కేసులో మాత్రం ఆ ఊసే లేదు. తెలుసుకోవాల్సిన విషయాలన్నీ రాబట్టేశామనో, ఏమో కాని దర్యాప్తులో అంత సీరియస్ నెస్ లేదు అనే గుసగుసలు వినిపిస్తున్నాయి..కాకినాడ ఎస్పీ చెప్పిన సమాచారం మేరకు ఉద్దేశపూర్వకంగా అనంత బాబు సుబ్రహ్మణ్యంని చంపలేదు. ఇద్దరి మధ్యా జరిగిన చిన్నపాటి ఘర్షణలో ఈ హత్య జరిగిందని.. గేటు దగ్గర ఉన్న గ్రిల్ తలకి తగిలి సుబ్రహ్మణ్యం చనిపోయాడని ఎమ్మెల్సీ చెప్పారని వెల్లడించారు ఎస్పీ. అయితే హత్యలు రకాల రకాల కారణాలతో జరుగుతుంటాయి. ఉద్దేశపూర్వకంగా ముందస్తు ప్రణాళికతో చేసే హత్యలకు శిక్ష తీవ్రంగా ఉంటుంది. ఆత్మ రక్షణ కోసం జరిగే హత్యల ను ఇంకో రకంగా తీసుకుంటారు. డ్రైవర్ హత్య ఇలాగే జరిగింది అని ఎమ్మెల్సీ కథనాన్ని వివరిస్తూ పోలీసులు కన్‌ఫమ్ చేసారు. అయితే ఎమ్మెల్సీని పోలీసులు అదుపులోకి తీసుకున్నాక.. లోతుగా దర్యాప్తు చేయాల్సిన అవసరం లేదా అనే గుసగుసలు వినిపిస్తున్నాయి.మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచే ముందే పోలీసులు కస్టడీ పిటిషన్ వేస్తారని ప్రచారం జరిగింది. దానికి సంబంధించిన డాకుమెంట్స్ సిద్ధం చేస్తున్నారనే వార్తలు వచ్చాయి. సెక్షన్ 302 అంటే హత్య కేసు.. అటువంటి కేసుల్లో విచారణ చాలా కీలకం. సీన్ రీ కన్స్ట్రక్షన్ చేయాల్సిన అవసరం ఉంటుంది. కానీ జిల్లా పోలీసులు మాత్రం వాటిపై పెద్దగా దృష్టి పెట్టినట్టు కనిపించడం లేదు. అన్నీ తమకు తెలుసులే.. కొత్త విషయాలు ఏముంటాయి అనుకుంటున్నారు ఏమో మరి.. ఈ కేసులో ఇప్పటికే అనంత బాబు బెయిల్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతుంది. కానీ పోలీసులు మాత్రం విచారణ అధికారిగా కాకినాడ డిఎస్పి భీమారావు ని నియమించి సరిపెట్టారు. ఇప్పటికే సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు పోలీసులు చెప్పిన దానితో వ్యతిరేకిస్తున్నారు.

## నేడు ప్రపంచ తల్లిదండ్రుల దినోత్సవం

తల్లిదండ్రుల దినోత్సవంను ప్రతి ఏడాది జూన్ 1న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు. పిల్లలు పెద్దవుతున్నకొద్దీ పెద్దవాళ్లు చిన్నపిల్లలుగా మారిపోతుంటారు. ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా బిడ్డలు వదిలి వెళ్లిపోతుంటే ఒంటరిగా బతకలేక తల్లిదండ్రులు కఠిన పరీక్షలు ఎదుర్కొంటారు. ఈ క్రమంలో వారు పిల్లలతో ఉందామని ఆశపడతారు. కానీ వారి కోరిక నేరవేరదు. దీంతో మానసిక వ్యాధికి గురవుతుంటారు. ఇటువంటివారి వేదనను గుర్తించి ఏడాదిలో ఒక్కరోజైనా వారి ఆశను నేరవేర్చడానికి ఏర్పాటైందే ఈ తల్లిదండ్రుల దినోత్సవం. ప్రపంచ తల్లిదండ్రుల దినోత్సవాన్ని 2012లో యూఎన్ జనరల్ అసెంబ్లీ తీర్మానం చేసింది. తల్లిదండ్రుల దినోత్సవాన్ని నిర్వహించాలన్న ప్రతిపాదన అమెరికాలో మొదలైంది. 1984లో అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ అధికారికంగా ఈ దినోత్సవానికి ఆమోద ముద్రవేశారు. దీంతో అప్పటి నుంచి తల్లిదండ్రుల దినోత్సవాన్ని ప్రపంచ దేశాలు నిర్వహిస్తున్నాయి. వివిధ దేశాల్లో ఈ దినోత్సవాన్ని వేరువేరు తేదిల్లో జరుపుకుంటారు. తల్లిదండ్రుల విషయంలో ఎటువంటి భేదం ఉండకూడదని సుప్రీం కోర్టు ఆదేశించడంతో పేరెంట్స్ డే ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. ప్రస్తుతం ఈ కోవిడ్ 19 మహమ్మారి సమయంలో తల్లిదండ్రుల తమ పిల్లల విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తలు, వారి పట్ల వహిస్తున్న శ్రద్ధ అభినందనీయం. అంతేకాదు శ్రామిక కుటుంబాలు ఈ విపత్తు సమయంలో కాలిబాటన తమ సొంత గూటికి వెళ్తున్నప్పుడు వెంట తమ పిల్లలు మరో వైపు లగేజీ ఇంకోవైపు అధిక ఉష్ణోగ్రతలను, ఆకలిదప్పులను ఓర్చుకుంటూ ప్రపంచమంతా విస్మయం చెందేలా వారు సాగించిన పయనానికి ప్రభుత్వాలే కదిలి వచ్చేలా చేశారు. ఇలాంటి ఆపద సమయంలో కుటుంబం ఆసరా, తల్లిదండ్రుల తమ పిల్లల పట్ల వహించే బాధ్యతలను, తల్లిదండ్రుల గొప్పదనాన్ని ప్రపంచానికి తెలియజేయడమే కాక గుర్తించేలా చేసింది. ఈ యాంత్రిక జీవనంలో పిల్లలు తమ తల్లిదండ్రులను వృద్ధాప్యంలో వారిని నిర్లక్ష్య చేయకుండా, వృద్ధాశ్రమాలకు తరలించి చేతులు దులుపుకోకుండా వారికి సేవలు చేయడం, మన భవిష్యత్తు కోసం ఎన్నో త్యాగాలు చేసిన వారి పట్ల బాధ్యతయుతంగా ఉండేలా చేయడం, అందరూ తమ తల్లిదండ్రులను పేమానురాగాలతో చూసుకునేలా చేయడం మొదలైనవి ఈ దినోత్సవం ముఖ్యోద్దే శాలు.

# కోనసీమ వాసులకు ఇంటర్నెట్ కష్టాలు

కాకినాడ, మే 31,ఒక్క ఘటనతో ఎన్నో సమస్యలు తెరమీదకు వచ్చాయి, కోనసీమ జిల్లా వాసులకు ఇంటర్నెట్ కష్టాలు తీరడం లేదు. నెట్ కోసం గోదారి గట్టు చేరుకుంటున్నారు జనం. అమలాపురంలో కోనసీమ జిల్లాకు అంబేద్కర్ పేరు పెట్టడంపై తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం అయింది. కోనసీమ జిల్లాలో ఇటీవల జరిగిన అల్లర్ల కారణంగా ఇంటర్నెట్ సేవలు బంద్ కావడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇంటర్నెట్ ఎక్కడ వస్తే అక్కడికి చేరుకుంటున్నారు జనం. గోదావరి గట్ల మీదకు వచ్చి నెట్ సిగ్నల్స్ కోసం పడిగాపులు పడుతున్నారు.కరోనా కారణంగా చాలామంది వర్క్ ఫ్రం హోంకి అలవాటుపడ్డారు. కంపెనీలు కూడా వర్క్ ఫ్రం హోం అవకాశం ఇవ్వడంతో స్వగ్రామాలకు, అత్తారింటికి వెళ్ళిపోయారు సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు. అయితే కోనసీమ జిల్లా రచ్చతో వారికి నెట్ ప్లాబ్లంస్ వస్తున్నాయి. కోనసీమ జిల్లా పేరు పై అమలాపురం లో జరిగిన అల్లర్లతో ఐదు రోజులుగా ఇంటర్నెట్ సేవలను పోలీసులు నిలుపుదల చేశారు. మరికొద్ది రోజులు ఈ కష్టాలు తప్పవంటున్నారు పోలీసులు. దీంతో నెట్ లేక అన్ని వర్గాలు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇటు ప్రభుత్వ కార్యాలయాలు అటు ప్రైవేటు సంస్థలతోపాటు వర్క్ ఫ్రం హోమ్ తో ఇళ్లకు పరిమితమైన సాఫ్ట్ వేర్ ఉద్యోగులు ఇతర ఉద్యోగులు సైతం నెట్ కోసం నానా అవస్థలు పడుతున్నారు.దీంతో నెట్టు ఉన్న సమీప గ్రామ ప్రాంతాలకు పట్టణాలకు తరలి వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కొన్ని ప్రాంతాలు అయితే గోదావరి గట్టుకు అవతల నెట్ సేవలు పని చేస్తుండడంతో గట్టు ఇవతల లంక గ్రామాలకు ఉద్యోగస్తులు తరలి వెళ్లి తమ పనులను చేసుకుంటున్నారు. దీంతో లంక గ్రామాల్లో గోదావరి గట్లు జనంతో కిక్కిరిసి పోతున్నాయి. వేసవితో ఒకపక్క ఉక్కపోత ఇబ్బందిపెడుతోంది. మరోపక్క గోదావరి గట్టున చెట్ల కింద ఉపశమనం పొందుతూ ఉద్యోగులు తమ పనులను నిర్వర్తిస్తున్నారు. ఇంటర్నెట్ ఎప్పుడు ఇస్తారు తమ బాధలు ఎప్పుడు తీరతాయి ఉంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

# జూన్ 1 నుంచి ఉత్తరాంధ్ర నాగబాబు పర్యటన



విజయవాడ మే 31, నటుడు నాగబాబు జూన్ 1 నుంచి ఉత్తరాంధ్ర పర్యటన చేపట్టనున్నారు. జనసేన పార్టీ విధానాలు, పవన్ కల్యాణ్ ఆలోచనలను ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేసే లక్ష్యంతో ఆయనీ పర్యటన చేపడుతున్నారు. ఏపీలో ఎన్నికల హీట్ పెరిగిన నేపథ్యంలో ప్రజలలో మరింత మమేకమయ్యే విధంగా జనసేన ప్రణాళికలు రూపొందించుకుంటోంది. అందులో భాగంగగానే నాగబాబు ఉత్తరాంధ్రపర్యటన అని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే బాదుడే బాదుకు, మహానాడు కార్యక్రమాల ద్వారా తెలుగుదేశం పార్టీ ఎన్నికల సన్నద్ధతను ఘనంగా చాటింది. అదే విధంగా గడప గడపకూ, సామాజిక న్యాయ భేరి బస్సు యాత్ర ద్వారా వైసీపీ కూడా జనం బాట పట్టింది. దీంతో జనసేన కూడా ప్రజలతో మమేకమయ్యే కార్యక్రమాలకు నాగబాబు ఉత్తరాంధ్ర పర్యటనతో శ్రీకారం చుట్టనుంది. జూన్ 1న శ్రీకాకుళంలో నాగబాబు పర్యటిస్తారు, ఆ తరువాత 2 న విజయనగరం, 3న విశాక జిల్లాలలో పర్యటించనున్నారు.నాగబాబు పర్యటనతో ఉత్తరాంధ్రలో జనసేన కార్యక్రమాలు జోరందుకుంటాయని చెబుతున్నారు. ఉత్తరాంధ్రప్రర్యటన అనంతరం నాగబాబు రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల పర్యటనకు షెడ్యూల్ ప్రకటిస్తారని జనసేన వర్గాలు తెలిపాయి.

# పల్నాడు లో ఘోర రోడ్డు ప్రమాదం..

## తొమ్మిది మంది మృతి

పల్నాడు పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శ్రీశైలం నుంచి తిరిగి వస్తున్నటాటా ఏస్ వాహానం.. రెంటచింతలోని కరెంట్ ఆఫీస్ వద్ద ఆగి ఉన్న లారీ ను ఢీ కొన్నది. ఈ ప్రమాదంలో వాహనం పల్టీ కొట్టింది. దీంతో అందులో కిక్కిరిసి ప్రయాణిస్తున్న వారాంత ఒకరిపై ఒకరు పడిపోయారు. ఈ ఘటనలో అక్కడికక్కడే 9 మంది మృతి చెందారు. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్నవారిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది. దీంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఈ ప్రమాద సమయంలో టాటా ఎస్ వాహనంలో 38 మంది ప్రయాణీకులు ఉన్నట్లు తెలుస్తోంది. వీరంతా రెంటచింతల బీసీ కాలనీకి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదానికి కారణం చీకటితో పాటు..డ్రైవర్ రహదారిపై ఆగి ఉన్న ఉన్న లారీని గమనించకపోవడంతో ప్రమాదం జరిగింది.

# తెలంగాణ వ్యక్తులకు ఏపీలో రాజ్యసభ సీట్లపై నిరసన

విశాఖపట్నం తెలంగాణ వ్యక్తులకు ఆంధ్రప్రదేశ్లో రాజ్యసభ సీట్లు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ విశాఖలో ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ జేఏసీ వినూత్న రీతిలో ఆందోళన చేపట్టింది. ఆంధ్రప్రదేశ్లో ఉన్న స్థానికులను కాదని తెలంగాణ వారికి సీటు ఇవ్వడం పట్ల నిరుద్యోగ జేఏసీ కార్యకర్తలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. పెద్దల సభలో స్థానికేతరులను కూర్చోబెట్టడం వల్ల ఉత్తరాంధ్రకు ఏళ్లతరబడి అన్యాయం జరుగుతుందని వాపోయారు. ఏపీకి ప్రత్యేక హోదా విశాఖ రైల్వే జోన్ ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ పోలవరం నిధులు విశాఖ ఉక్కు గనులు కడప స్టీల్ ప్లాంట్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆంధ్రప్రదేశ్లో ఉన్నవారికి రాజ్యసభ సీట్లు కేటాయించాలని లేనిపక్షంలో అన్ని పార్టీలను కలుపుకుని ఉత్తరాంధ్ర ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని కై పూనుకుంటామని హెచ్చరించారు.

# ఏపీ వైసీపీలో ఫ్రస్టేషన్



విజయవాడ, మే 31, ఏపీలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారపీఠం ఎక్కి మూడేళ్లు పూర్తయింది. ఈ మూడేళ్లలో సీఎంగా ఉన్న వైఎస జగన్ గానీ, వైసీపీ సర్కార్ కానీ ప్రజల కోసం చేసిందేమీ లేదు, సాధించింది కూడా ఏమీ లేదనేది జనం నుంచి తీవ్రంగా వస్తున్న విమర్శ. అయినప్పటికీ ఏదో పొడిచేశామనే ఫీలింగ్ మాత్రం జగన్ అండ్ కోలో ఎక్కువగా కనిపిస్తోందంటున్నారు. అనాలోచిత, అనుభవం లేని నిర్ణయాలతో రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించడమే కాకుండా.. ప్రాథమిక సౌకర్యాలను కూడా కల్పించలేక చతికిలపడిన విషయం జనానికి బాగానే అర్థం అవుతోంది. మూడేళ్లలోనే జనంలో వైసీపీ సర్కార్ పట్ల వ్యతిరేకత వ్యక్తమౌతోంది. ఎక్కడ చూసినా ప్రజల నుంచి నిరసనలు, వ్యతిరేకతలు వ్యక్తం అవుతున్నాయి. 'సామాజిక న్యాయ భేరి' పేరుతో శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు వైసీపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ మంత్రులు చేసిన బస్సు యాత్ర తుస్సు మంది. వైసీపీ మంత్రులు ఎక్కడ సభ పెట్టినా జనానికి కూలి ఇచ్చి మరీ తెప్పించుకున్నా.. ప్రసంగాలు ప్రారంభం అయ్యే సమయానికే సొమ్ములిచ్చి మరీ తీసుకువచ్చిన జనం పొలోమంటూ లేచి వెళ్ళిపోయారు.మరో పక్కన టీడీపీ కార్యక్రమాలకు జనం పోటెత్తుతున్నారు. బాదుడే బాదుడు, మహానాడు కార్యక్రమాలే ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. వైసీపీ పాలనపై తమ వ్యతిరేకతను, నిరసనను జనం బహిరంగంగానే వ్యక్తం చేస్తున్నారు. అటు వైసీపీ కార్యక్రమాలకు వచ్చేందుకు ఇష్టపడకపోవడం, ఇటు టీడీపీ ఏ కార్యక్రమం తీసుకున్నా సక్సెస్ చేయడమే దీనికి తాజా ప్రత్యక్ష నిదర్శనం. దీంతో సీఎం జగన్ సహా వైసీపీ మంత్రులు, మాజీ మంత్రులు, నేతల్లో ఫ్రస్టేషన్ పెరిగిపోతోంది.మొన్నా మధ్యన సీఎం జగన్ వెంట్రుక కూడా పీకలేరంటూ తన ఫ్రస్టేషన్ ను బహిరంగంగా వెళ్లగక్కేసారు. దీంతో ఆయన మంత్రివర్గ సహచరులు, మాజీ మంత్రులూ కూడా అదే బాటలో పయనిస్తున్నారు. ఫ్రస్ట్రేషన్ ను దాచుకునే కనీస మర్యాదను, విలువలను పాటించడం లేదు. తాజా మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు విశాఖపట్నంలో జరిగిన ఒక కార్యక్రమంలో తన ఫ్రస్టేషన్ ను బయటపెట్టుకున్నారు. సభ జరుగుతుండగా ఓ మీడియా ప్రతినిధిపై విరుచుకుపడుతూనే అవంతి శ్రీనివాసరావు.. అక్కడే ఉన్న ఓ పోలీస్ సబ్ ఇన్ స్పెక్టర్ పై నోరు పారేసుకోవం ఇందుకు నిదర్శనం'నీకు ఉద్యోగం ఇచ్చింది ఎందుకు.. నీ సంగతి చూస్తానం'టూ అవంతి తనలో ఉన్న ఫ్రస్టేషన్ వెళ్లగక్కారు. తాజాగా మంత్రుల 'సామాజిక న్యాయ భేరి' బస్సుయాత్ర అనంతపురం జిల్లాలో ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి వెళ్తూ మంత్రి బొత్స సత్యనారాయణ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసేందుకు బస్సుదిగి వెళ్ళారు, ఆ సమయంలొ అడ్డొచ్చిన ఓ దఫేదారుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక చైతన్య బస్సు యాత్రలో వైసీపీ మంత్రులు ప్రతి చోటా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిని ఆడిపోసుకోవడంపైనే దృష్టి సారించడం ఏంటనే ప్రశ్నలు జనం నుంచి వస్తున్నాయి. రాజకీయంగా విమర్శిస్తే సరేసరి.. కానీ వ్యక్తిగతంగా 'చంద్రబాబు మెదడు చితికిపోయింది' లాంటి విమర్శలు చేయడమేమిటని పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు. ఈ మూడేళ్లలో ఏపీ ప్రజల బాగు కోసం తాము చేసిందేమిటో చెప్పుకోలేని వైసీపీ నేతలు ప్రతిపక్ష తె?లుగుదేశం నేతలను, ఆ పార్టీ కార్యక్రమాలను టార్గెట్ గా చేసుకుని ఇష్టారీతిగా వ్యఖ్యలు, విమర్శలు చేస్తూ తమ లోని ఫ్రస్టేషన్ బయటపెట్టుకుంటున్నారు. ఒంగోలులో జరిగిన మహానాడుపై వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించడం గమనార్హం. పనిలో పనిగా చంద్రబాబును ఆయన టార్గెట్ చేసి విమర్శలు గుప్పించడం తమలోని అసహనాన్ని కాస్తయినా చల్చార్చుకోవడానికే నని పరిశీలకులు ఉంటున్నారు. మహానాడును 'ఏడుపునాడు' అంటూ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యానించినా.. 'చంద్రబాబుది అబద్ధాల ఏడుపు' అంటూ మంత్రి వేణుగోపాలకృష్ణ అన్నా.. అదంతా వారిలో పెరిగిపోతున్న ఫ్రస్టేషనే అంటున్నారు. ఓటమి భయమే వారిలో ఫ్రస్టేషన్ రూపంలో బయటపడుతోందని తెలుగుదేశం నేతలు ఎద్దేవా చేస్తున్నారు.

# హౌసింగ్, జగనన్న స్వచ్ఛ సంకల్పంపై ప్రత్యేక దృష్టి సారించాలి

## అధికారులకు జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదేశాలు

## ఓటీఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి

కడప గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో.. హౌసింగ్ నిర్మాణ పనులతో పాటు.. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇళ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే.. ప్రజారోగ్య భద్రతకు భరోసా అందుతుందని.. జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్ లో జేసీ.సాయికాంత్ వర్మ, డిఆర్వో మాలోల, నగర కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్, హౌసింగ్ పీడి కృష్ణయ్య లతో కలిసి.. జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతి, ఓటీఎస్, జగనన్న స్వచ్ఛ సంకల్పం యాక్షన్ ప్లాన్, గ్రావెల్ మైనింగ్ పర్మిషన్ లతో పాటు.. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరు, పురోగతి, సర్వీసు రిక్వెస్టులు - పరిష్కారాలు తదితర అంశాలపై మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు.. నేరుగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు మాట్లాడుతూ... ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు.. ప్రజలకు సంతృప్త స్థాయిలో అందాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు అధికారులందరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. గ్రామాలు, వార్డుల పరిధిలో.. వన్ టైం సెటిల్మెంట్ (ఓటీఎస్) ప్రక్రియలో స్టేజి కన్వర్షన్, డిజిటల్ సైనింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో జగనన్న హౌసింగ్ పథకం.. ఎంత ప్రధాన్యతతో నిర్వహించడం జరుగుతుందో.. అంతే ప్రధాన్యతతో "జగనన్న స్వచ్ఛ సంకల్పం" కార్యక్రమాన్ని కూడా చేపడ్డాడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా.. ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య పనులు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటికి ట్విన్ బిన్స్, ఘన వ్యర్థ పదార్థాల సేకరణ, వర్మి కంపోస్టు షెడ్స్ ఏర్పాటు మొదలైన అన్ని పనుల నిర్వహణను ప్రణాళికాబద్ధంగా నిరంతరాయంగా.. జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలం సమీపిస్తుండడంతో డ్రైనేజీ కాలువల్లో పిచ్చి మొక్కలు తొలగింపు, దోమల నియంత్రణ చర్యలను ఈ వారం లోగా పూర్తి చేయాలన్నారు.గ్రామాల్లో, మున్సిపాలిటీలలో ఎక్కడా కూడా ఒక్క కాగితం ముక్క కూడా కనిపించకూడదని హెచ్చరించారు. ఈ వారాన్ని "క్లాప్ వారం" గా ప్రకటించి.. ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలన్నారు. పబ్లిక్ ప్రాంతాల్లో, డివైడర్లకు పోస్టర్లు అంటిస్తే.. నిర్ణీత అపరాధ రుసుము వసూలు చేయాలన్నారు. అంతేకాకుండా.. ప్రభుత్వ కార్యాలయాలు, పరిసరాలతో ఎలాంటి పేపర్ పోస్టర్లు అంటించకూడదన్నారు. పారిశుద్ధ్యం నిర్వహణకు సంబంధించి ఒక ఎస్.ఓ.పి. ని తయారు చేసి.. జిల్లా వ్యాప్తంగా.. అమలుచేయలన్నారు. "జగనన్న స్వచ్ఛ సంకల్పం" నిర్వహణలో.. ప్రతి మండలానికి ఒక మోడల్ గ్రామాన్ని ఎంపిక చేయడం జరిగిందన్నారు. ప్రతివారం.. ఆయా గ్రామాలను ఆకస్మికంగా తనిఖీ చేయనున్నట్లు తెలిపారు.

గ్రావెల్ సరఫరా అనుమతికి సంబంధించి.. గ్రామీణ, మున్సిపాలిటీల పరిధిలో.. తహశీల్దార్లు, ఆర్డీవోల అనుమతితో మాత్రమే నిర్వహించాలన్నారు. నిర్ణీత ఎస్.ఓ.పి. ప్రకారం.. ప్రభుత్వ పనుల నిర్వహణకు మాత్రమే.. అనుమతులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అందుకోసం పంచాయతీ సెక్రెటరీలు, ఎంపిడివోలు, ఈవోపిఆర్డీ లు.. ప్రత్యేక అమలు ప్రక్రియను బచేపట్టాలన్నారు.స్పందన పోర్టల్, మీసేవా, ఏపీ సేవా పోర్టల్ లో ప్రతిరోజు విధిగా సర్వీసు రిక్వెస్టులను పరిశీలించి సంబందిత రిపోర్టులు, పరిష్కార నివేదికలను నమోదు చేయాలన్నారు. ప్రతి వారం ప్రగతి నివేదికలు అందజేయాలన్నారు. ప్రధానంగా.. జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని.. ఆయా మండలాలు, మున్సిపాలిటీల పరిధిలోని లే అవుట్లలో గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. గృహనిర్మాణ పనులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని.. ఆదేశించారు. జేసీ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ... సచివాలయాల పరిధిలో ప్రతి ఇంట్లో విధిగా ఫీవర్ సర్వే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ లేఔట్స్, హౌస్ గ్రౌండింగ్, నిర్మాణ పనుల వేగవంతంతో పాటు.. భూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా రీసర్వే, జగనన్న సంపూర్ణ గృహహక్కుకు సంబంధించి.. ఓటీఎస్, కోవిడ్ వాక్సినేషన్, సచివాలయాల్లో బయోమెట్రిక్, సచివాలయ భవన నిర్మాణాలు, స్పందన అర్జీల పరిష్కారం వేగవంతం తదితర అంశాలపై యాక్షన్ ప్లాన్, పురోగతిపై.. సిహెచ్ఓలు, ఎంహెచ్ఓ లతో సమీక్షించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంతో భాగంగా.. పట్టణ ప్రాంతాల్లో చేపడుతున్న ఇళ్ల నుండి చెత్త సేకరణ కార్యక్రమంపై ఎంపిడివోలు, మున్సిపల్ అధికారులు, పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా.. మండల వారీగా కూలీల డేటాను సేకరించి నమోదు చేయాలన్నారు. నాడు-నేడు పనులను ఎక్కడా కూడా నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా.. నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. అంతేకాకుండా.. ఎన్.ఆర్.ఈ.జి.ఎస్. పనిదినాలను కల్పించడంలో జిల్లాకు నిర్దేశించిన రోజువారీ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప, జమ్మలమడుగు, బద్వేలు రెవెన్యూ డివిజన్ల.. ఆర్డీవోలు ధర్మచంద్రారెడ్డి, శ్రీనివాసులు, వెంకటరమణ లతో పాటు నియోజకవర్గ, మండల ప్రత్యేకధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడివోలు, హౌసింగ్, డ్వామా, డిఆర్డీఏ, పీఆర్ అధికారులు, ఇంజనీర్లు తదితరులు హాజరయ్యారు.

# సివిల్ సర్వీసెస్ లో మెరిసిన నర్సీపట్నం తేజం

## ఆల్ ఇండియా స్థాయిలో సాధించిన 28 వ ర్యాంకు

## ఐదోసారి ఫలించిన ప్రయత్నం...జీవన ప్రమాణాలను పెంచేందుకు కృషి చేస్తానన్న భరద్వాజ్

## పలువురు ప్రముఖుల అభినందనల వెల్లువ

నర్సీపట్నం సివిల్ సర్వీసెస్ లో నర్సీపట్నం తేజం మెరిసింది. మే 30న ప్రకటించిన సివిల్ సర్వీసెస్ 2022 ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో నర్సీపట్నంనకు చెందిన భరద్వాజ్ అనే యువకుడు 28వ ర్యాంకులో నిలిచారు. 2017 నుంచి వరుసగా ఐదు సార్లు ప్రయత్నం చేసి, ఐదోసారి ఫలితం సాధించారు. గొలుగొండ మండలం, కొత్త మల్లంపేట, హైస్కూలులో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న ప్రసాద్ కు పెద్ద కుమారుడయినటు వంటి భరద్వాజ్ మూడో ఇంటర్వ్యూకిహాజరై ఫలితాన్ని చేజిక్కించుకున్నారు. భరద్వాజ్ కుటుంబం నర్సీపట్నంలోనే నివాసం ఉంటున్నారు. తల్లి రాధాకుమారి ఏరియా ఆస్పత్రిలో ఫార్మాసిస్టుగా పనిచేస్తున్నారు.

భరద్వాజ్ చిన్నతనం నుంచి నర్సీపట్నంలో డాన్ బస్కో పాఠశాలలో పదవ తరగతి వరకు చదివారు. ఇంటర్మీడియట్ విశాఖ చైతన్య కాలేజీలో పూర్తి చేసి, వరంగల్ నిట్ లో బీటెక్ పూర్తి చేశారు. తరువాత దానికి సంబంధించిన సంస్థల్లోనే రెండేళ్లపాటు ఉద్యోగం చేస్తూ, మరలా సివిల్ సర్వీసెస్ పై దృష్టి సారించారు. మూడు దఫాలుగా చేసిన ప్రయత్నం విఫలం అయ్యింది. అయినా తల్లిదండ్రులు ప్రోత్సాహంతో మరలా ఉద్యోగంలో చేరి, తన ప్రయత్నాన్ని కొనసాగించి, ఐదో దఫాలో జాతీయ స్థాయిలో 28వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా భరద్వాజ్ మాట్లాడుతూ పేదల జీవన ప్రమాణాలు పెంచే దిశగా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మిగిలిన అన్ని శాఖలను సమన్వయం చేస్తూ అన్ని వర్గాలు అభివృద్ధి సాధించే దిశగా తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పుకొచ్చారు. మూడో దఫా కాస్త నిరాశ చెందినా తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహంతో కొనసాగించానన్నారు.

నర్సీపట్నంలో ఇప్పటివరకు ఎన్నడూలేని విధంగా తొలి సివిల్ సర్వీసెస్ ర్యాంకు సాధించడం ఇదే ప్రథమం. 16 సంవత్సరాల క్రితం నర్సీపట్నానికి సమీపంలో ఉన్న పాములవాక గ్రామానికి చెందిన కిల్లాడి సత్యనారాయణ ఐపీఎస్ సాధించారు. అప్పట్నుంచి, మరలా భరద్వాజ్ సివిల్ సర్వీసెస్ సాధించడంతో పీఆర్టీయు జిల్లా అధ్యక్షులు డీజీ నాథ్ తో పాటు పలువురు తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

# జిల్లా కేంద్రంలో పొగాకు వ్యతిరేక ర్యాలీ

పెద్దపల్లి : జిల్లా కేంద్రంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీని జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం ఆసుపత్రి నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి ఆ తరువాత సిగరెట్ డబ్బాలను దహనం చేశారు. పొగాకు, వాటి వాడకం ఆరోగ్యానికి హానికరమని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, అరోగ్య శాఖ అధికారి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ పొగాకు వాడకం వల్ల ప్రజల అరోగ్య దెబ్బతింటుందని, క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, అల్జీమర్, ఇన్ఫర్టిలిటి, మధుమేహం వ్యాధులు వస్తాయి అన్నారు. ఇంతే కాక పొగాకు పంట వలన పర్యావరణ కాలుష్యం అవుతుందని అందుకే ఈ సంత్సరము థీమ్ అయిన " పొగాకు మన పర్యావరణముకు ముప్పు" అని ప్రచారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు పురుషోత్తం, మహేందర్, మమత, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బాధ్యుడు రాజగోపాల చారి, వెంకటేశ్వర్లు, డిప్యూటీ డెమో, డీపిఓ రాజేందర్, ఎన్ సిడి సమన్వయ కర్త రాజేశం, పి హెచ్ సి రాఘవాపూర్, రాగినేడు సూపరవైజర్ లు, ఏ ఎన్ యంలు, ఆశలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల సాధనకు డిజేఎఫ్

పెద్దపల్లి జర్నలిస్టుల హక్కుల సాధనకు డిజేఎఫ్ ముందుండి పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో జరిగిన డిజెఎఫ్ జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై డిజెఎఫ్ జర్నలిస్టుల మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం విజయ్ కుమార్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జర్నలిస్టుల హక్కుల సాధనే ధ్యేయంగా చిన్న, పెద్ద జర్నలిస్టులంటూ తారతమ్యం లేకుండా పోరాటమే మార్గంగా ఏర్పడిన ప్రగతిశీల పాత్రికేయ ఐక్య కూటమి డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అని తెలిపారు. జూన్ 4న హైదరాబాద్ లో జరగనున్న డిజెఎఫ్ జర్నలస్టుల మహాసభ కు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని విభాగాల్లో పనిచేసే జర్నలిస్టులంతా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిజెఎఫ్ రాష్ట్ర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహర్షి మల్లన్న, జిల్లా కోఆర్డినేటర్ జక్కే రాజ్ కుమార్ సభ్యులు గుర్రం పరుశురాం, కొ మ్మగల్ల బాబు, బాలసాని కుమార్,వడ్లూరి రాజేశ్వర్ రావు, బెజ్జాల ప్రభాకర్, దొంతనవేణ రాజు, పోతుల జాన్,నూతి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతే.. దేశానికి వెన్నెముక

## సిమ్లాలో గరీబ్ కల్యాణ్ సమ్మేళన

## దేశ వ్యాప్తంగా 10 కోట్ల మందికిపైగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలను రూ. 21 వేల కోట్ల నిధుల బదిలీ

## జిల్లాలో 1,98,000 మంది రైతులకు గాను.. రూ. 37.88 కోట్ల 'పిఎం-కిసాన్' సాయం విడుదల

కడప దేశానికి వెన్నెముక అయిన రైతు క్షేమంగా ఉంటేనే.. రాజ్యం సుభిక్షంగా ఉంటుందని భారత ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించిన మాటలు.. అక్షర సత్యాలు అని.. జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు అభివర్ణించారు.మంగళవారం సిమ్లాలో గరీబ్ కల్యాణ్ సమ్మేళన్ కార్యక్రమంలో పాల్గొన్న భారత ప్రధాని నరేంద్రమోడీ.. దేశ వ్యాప్తంగా అన్ని కృషీ విజ్ఞాన కేంద్రాల్లో గరీబ్ కళ్యాణ్ సమ్మేళన్ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 11వ విడత పిఎం-కిసాన్ పథకంలో భాగంగా.. దేశ వ్యాప్తంగా 10 కోట్ల మందికి పైగా లబ్దిదారులకు రూ. 21 వేల కోట్ల నిధులను వారి ఖాతాలకు జమ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ సభా భవన్ నుండి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు తోపాటు.. జేసీ సాయికాంత్ వర్మ, డిఆర్వో మాలోల, ఆప్కాబ్ చైర్ పర్సన్ మల్లెల ఝాన్సి రాణి, అడా చైర్మన్ గురు మోహన్, రాష్ట్ర మరాఠా సంఘం సభ్యురాలు రజని.. లు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా.. ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా.. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ప్రధాన మంత్రి అవాజ్ యోజన, ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, పోషణ్ అభియాన్, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన, స్వచ్ఛ భారత్ మిషన్, జలజీవన్ మిషన్ మరియు ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, ఆయుష్ భారత్ పి.ఎం.జన ఆరోగ్య యోజన, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్, ప్రధాన మంత్రి ముద్రా యోజన పథకాలకు సంబంధించి అన్ని రాష్ట్రాల లబ్దిదారులతో వర్చువల్ విధానంలో ప్రధానమంత్రి మాట్లాడారు. ప్రధానమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం.. జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు మాట్లాడుతూ.. రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని భావించిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు.. రైతు సంక్షేమం కోసం పెద్దపీట వేశయన్నారు. కేంద్ర ప్రభుత్వం "పిఎం-కిసాన్" సమ్మాన్ పథకం ద్వారా 11వ విడతగా జిల్లాలో "పిఎం కిసాన్ సమ్మాన్" క్రింద 1,98,000 మంది లబ్దిదారులకు రూ.37,88,00,000 లు మొత్తాన్ని ప్రధాని రైతుల ఖాతాల్లో జమ చేయడం సంతోషించదగ్గ విషయం అన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తోన్న ఈ సాయం.. రైతుల వ్యవసాయ సాగు పెట్టుబడికి ఎంతో ఉపకరిస్తోందన్నారు. అంతేకాకుండా.. వ్యవసాయంపై రైతుల్లో మరింత మక్కువ పెరిగిందన్నారు. గ్రామ సీమలో రైతులు సాగుబడిని పండుగ వాతావరణంలోచేపడుతున్నారన్నారు. ఈ ఏడాది.. ప్రకృతి కరుణించి అనుకున్న సమయానికంటే ముందుగానే రుతుపవనాలు కూడా రానున్నాయని.. ఆ దిశగా ఖరీఫ్ సాగుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను సమాయత్తం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు, ఏపీఎంఐపీ పీడి మధుసూధన రెడ్డి, ఎల్డిఎం దుర్గాప్రసాద్, ఎన్.ఐ.సి. సెంటర్ అదనపు డి.ఐ.ఓ. ఏపి సత్యనారాయణ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, బిజెపి జిల్లా నాయకులు, పిఎం కిసాన్ సమ్మాన్ లబ్దిదారులైన రైతులతో పాటు వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు కుటుంబాలకు అండగా వుంటాం

## జిల్లా ఎస్పీ కె కె అన్బురాజన్

కడప ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఒంటిమిట్ట ఏ.ఎస్.ఐ ఈ. రామసుబ్బయ్య , ఎ.ఆర్ కానిస్టేబుల్ ఎం.సి సంజీవరాజు (ఎ.ఆర్.పి.సి 3128) కుటుంబాలకు జిల్లా ఎస్. పి కే.కే.ఎన్ అన్బురాజన్ రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందచేశారు. పోలీసు వితరణ నిధి నుండి ఈ ఆర్థిక సాయం అందచేశారు. ఏ.ఎస్.ఐ రామసుబ్బయ్య సతీమణి జయమ్మ, ఎ.ఆర్ కానిస్టేబుల్ సంజీవరాజు సతీమణి అశ్వర్థ సాయిలీల లకు జిల్లా ఎస్.పి కే.కే.ఎన్ అన్బురాజన్ ఆర్థిక సాయం అందచేశారు. పోలీస్ సంక్షేమంలో భాగంగా ఈ మొత్తాన్ని అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్. పి కె.కె.ఎన్ అన్బురాజన్ మరణించిన సిబ్బంది కుటుంబ యోగక్షేమాలు విచారించారు.

# దేశ ప్రజలు కాంగ్రెస్ పాలనను కోరుకుంటున్నారు



కాంగ్రెస్ డిఆర్ఒ యం రాజీవ్ రెడ్డి

కర్నూలు మే 31 -: దేశ ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని కాంగ్రెస్ పాలనను కోరుకుంటున్నారని తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కర్నూలు జిల్లా కాంగ్రెస్ రిటర్నింగ్ అధికారి యం రాజీవ్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మంగళవారం రోజు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, నియోజకవర్గ ఇన్చార్జీలు , బ్లాక్ రిటర్నింగ్ అధికారుల సమావేశంలో రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వంలో నిత్యావసరాలు గ్యాస్ పెట్రోలు డీజిల్ ధరలన్నీ సామాన్య ప్రజలకు అదుపులో ఉండి అందుబాటులో ఉండేవని, నేడు బిజెపి ప్రభుత్వంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని దేశంలో దళితులకు మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందని నాడు స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడి స్వాతంత్ర్యం సంపాదించి మొదటి భారత ప్రధానిగా పండిట్ జవహర్లాల్ నెహ్రూ ని ప్రజాస్వామ్య పద్ధతిలో భారత మొదటి ప్రధానిగా ఎన్నుకున్నారని ఆనాడు పెద్దలు నిర్ణయించిన ప్రజాస్వామ్య దేశంలో నేడు సామాన్య నరేంద్ర మోడీ లాంటి వారు ప్రధాని కాగలిగారంటే నాటి కాంగ్రెస్ పుణ్యమే అని నేడు దేశాన్ని ప్రధాని మోడీ అంబానీ,ఆదాని లాంటి కార్పొరేట్ సంస్థలకు దోచి పెడుతున్నారని, అలాగే రాష్ట్రంలో నియంత పాలన సాగుతోందని సంక్షేమ పథకాలు ప్రచారానికే పరిమిత మయ్యాయని క్షేత్రస్థాయిలో సామాన్య ప్రజలకు చేరడం లేదని ఎన్నో సంవత్సరాలుగా రేషన్ కార్డులున్న లక్షల కుటుంబాలను సొంత ఇల్లు అధిక కరెంటు బిల్లు నాలుగు చక్రాల వాహనాలు అంటూ ఏదో ఒక నెపంతో రేషన్ కార్డులను తొలగించడం దారుణమని నాడు తెలుగుదేశం ప్రభుత్వంలో, నేడు వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు విసిగి పోయారని ప్రాంతీయ పార్టీలతో పాలన సాధ్యం కావడం లేదని ఒక్క జాతీయ కాంగ్రెస్ పార్టీతోనే పరిపాలన సాధ్య మవుతుందని ఆయన అభిప్రాయ పడ్డారు. అలాగే ప్రతి బూత్ కు ఒక అధ్యక్షుడిని ఒక డెలిగేట్ ను నియమించుకోవాలని గ్రామ కమిటీలు మండల కమిటీలు బ్లాక్ కమిటీలు నియోజకవర్గ కమిటీల నియామకాలు త్వరలో చేపట్టాలని అలాగే కర్నూలు పార్లమెంటు నందలి ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలను త్వరలో పర్యటిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు జాన్ విల్సన్ మాజీ ఎమ్మెల్సీ ఎంసుధాకర బాబు ఎన్ఎస్యూఐ రాష్ట్ర అధ్యక్షులు నాగమధు యాదవ్ పిసిసి అధికార ప్రతినిధి ఏ కరుణాకర్ బాబు డీసీసీ ఉపాధ్యక్షులు కె పెద్దారెడ్డి నియోజకవర్గాల ఇన్చార్జిలు కె లక్ష్మీనారాయణ రెడ్డి, బి క్రాంతినాయుడు కె బాబురావు ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న ఎన్ఎస్యూఐ జిల్లా అధ్యక్షులు వీరేష్ యాదవ్ కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ గుప్త ఎస్సీ సెల్ డబ్ల్యూ సత్యరాజ్ జోసెఫ్ నోయల్ రవి కుమార్ మహిళా కాంగ్రెస్ వెంకటలక్ష్మి మొదలగు వారు పాల్గొన్నారు.

# దళితులైన డప్పు, చర్మకారుల పెన్షన్ కు ఆటంకాలు సృష్టించకండి



పెన్షన్ కు నమోదు చేసుకోక పోవడమే సామాజిక న్యాయమా?
-:యం డి ఆనంద్ బాబుఎపిడికెయస్ రాష్ట్ర అధ్యక్షులు

ఆదోని మే 31 :- అర్హులైన నిరుపేద దళిత డప్పు కళాకారులు, చర్మకారులకు పెన్షన్ ఆన్లైన్ చేయడం లో ఆటంకాలు సృష్టించకండి అని, ఆటంక పరిచే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యం డి ఆనంద్ బాబు డిమాండ్ చేశారు.మంగళవారం డప్పు కళాకారులు, చర్మకారుల పెన్షన్ దరఖాస్తుకు వస్తున్న ఆటంకాలను తొలగించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం మండల కమిటి ఆధ్వర్యంలో స్థానిక కోసిగి మండల కేంద్రం లోని ఆర్ టి సి బస్టాండ్ నుండి హైస్కూల్ మీదుగా ఉరిమే డప్పుల శబ్దపు నిరసన తో యం పి డి ఓ కార్యాలయం వరకూ ప్రదర్శన నిర్వహించి, యం పి డి ఓ కార్యాలయం ముందు గంట పాటు ధర్నా నిర్వహించారు.కెవిపియస్ మండల కార్యదర్శి రామకోటి హనుమంతు అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎపిడికెయస్ రాష్ట్ర అధ్యక్షులు యం డి ఆనంద్ బాబు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారి పెన్షన్ నమోదు కే అధికారులు దళితులను ఒక వైపు అష్టకష్టాలు పెడుతుంటే, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం అధికారులను వెంట పెట్టుకుని సామాజిక న్యాయం పేరుతో ఊరూరా తిరుగడం ఎవరిని మోసం చేయడానికని ఆయన ఎద్దేవా చేశారు. కోసిగి మండలం లో యం పి డి ఓ గారే స్వయంగా డప్పు, చర్మ కారుల పెన్షన్లను తీసుకోవద్దని చెప్పారంటు సచివాలయాల ఉద్యోగులు దళితులను అవమానించి పంపుతున్నారన్నారు. విషయాన్ని జిల్లా అధికారుల ద్వారా తీసుకొని ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. సెల్ఫ్ డిక్లరేషన్ ద్వారా స్థానిక అధికారి పరిశీలించి ధ్రువీకరిస్తే దాన్ని ఆమోదిస్తామని సోషల్ వెల్ఫేర్ అధికారులు చెబుతున్నప్పటికీ, ఇలాంటి కనీస సమాచారం కూడా అధికారులకు లేకపోవడం, దళితుల సంక్షేమం పట్ల వారికుండే లెక్కలేని తనానికి నిదర్శనమన్నారు. ఎంపీడీవో గారే ప్రత్యేకంగా కలగజేసుకుని, అన్ని సచివాలయాలకు పెన్షన్ దరఖాస్తు కు సంబంధించిన ఆటంకాలను తొలగించేలా లేఖలు పంపాలన్నారు. లేనిపక్షంలో ఎక్కడికక్కడ అధికారులను ప్రజాప్రతినిధులను నిలవేసి దళితులకు జరుగుతున్న సామాజిక అన్యాయం పట్ల ఎండగడతాం అన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని యం పి డి ఓ ఆఫీస్ సూపరింటిండెంట్ రమాదేవి కి వినతి పత్రం ఇచ్చారు.ధర్నా కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హెచ్ చిన్న మారయ్య, కోసిగి మండల నాయకులు రామాంజి, ఫిలిప్, ప్రకాష్, కర్రెన్న, శ్రీను, దుబ్బన్న, ముక్కురన్న, యాకోబు, దేవపుత్ర, దేవదాసు, సుధాకర్, చిన్న ఆంజనేయ, తాయన్న, ఎల్లప్ప, ఉసేని, కౌతాళం మండలం నాయకులు వీరేష్, వీరన్న, నరసప్ప, ఎల్లప్ప, జట్టెప్ప తో పాటు మరో నలభై మంది కళాకారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత



ప్రతి కాలనీని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి........

మధురానగర్ లో గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి బస్తీబాట?శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలో మధురానగర్ లో ప్రజా సమస్యలపై బస్తీ బాట లో భాగంగా కాలనీలో సమస్యల గురించి ప్రజలను ఆరా తీశారు గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి గారు.అనంతరం కాలనీ లో నెలకొన్నసమస్యలను కార్పొరేటర్ గారికి మధురానగర్ కాలనీ వాసులు తీసుకువచ్చారు.ఇందులో భాగంగా కాలనీ లో మంచి నీళ్లు, సీసీ రోడ్డులు,పనితీరుపై తనిఖీ చేశారు.ఈ సందర్భంగా హెచ్ఎండబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడుతూ కాలనీలో అదనంగా మంచి నీటి పైపు లైను నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలనీ వాసులకు స్వచ్ఛమైన మంజీరా నీటిని అందించాలనే లక్ష్యంతో నూతనంగా పైపు లైనుల ఏర్పాటు చేయాలి అన్ని హెచ్ఎండబ్ల్యుఎస్ అధికారులని కోరారు. మెయింటెనెన్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. అన్ని ప్రాంతాల్లో మెరుగైన మంచినీటి సౌకర్యం కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పర్చే దిశగా పని చేస్తున్నామన్నారు. గచ్చిబౌలి డివిజన్ లోని ప్రతీ కాలనీ, బస్తీల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతీ మాటను నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. అధికారులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని త్వరగా పరిష్కరించాలని కోరారు. ఎలాంటి సమస్య ఉన్న ఇబ్బంది పడకుండా తనని సంప్రదించాలని స్థానికులకు హామీ ఇచ్చారు కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి గారు.కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి గారు స్పందిస్తూ ఇప్పటికే నిధులు కేటాయించారు వీలైనంత త్వరగా నిర్మాణం పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో హెచ్ఎండబ్ల్యుఎస్ మేనేజర్ నరేందర్ రెడ్డి గారు, రంగారెడ్డి జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు హనుమంతు నాయక్ గారు, గచ్చిబౌలి డివిజన్ వైస్ ప్రెసిడెంట్ ఆర్ వెంకటేష్ గారు, తిరుపతి గారు, మహిళా మోర్చా అధ్యక్షురాలు చిలుకూరి మహేశ్వరి గారు, గచ్చిబౌలి డివిజన్ మహిళా ప్రధాన కార్యదర్శి పూజ గారు

# దేశవ్యాప్తంగా పియం కిసాన్ సమ్మాన్ కింద 10 కోట్ల మందికి పైగా రైతుల బ్యాంకు ఖాతాలకు రూ. 21 వేల కోట్ల నిధుల బదిలీ

కర్నూలు జిల్లాలో 2,54,304 మంది రైతులకు పీఎం కిసాన్ ద్వారా రూ .50.86 కోట్లు లబ్ధి -: కర్నూలు జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు , మే, 31 : ఆజాదీ కా అమృత్ మహోత్సవం వేడుకల్లో భాగంగా కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ ఫథకాలను గుర్తుచేస్తూ గరీబ్ కళ్యాణ్ సమ్మేళన్ పేరుతో కేంద్రం కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్రమంలో మంగళవారం హిమాచల్ ప్రదేశ్ సిమ్లాలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోడి పాల్గొన్నారు. సిమ్లాలో నిర్వహించిన ఈ కార్యక్రమం వేదికపైనుంచే ప్రధాని మోడి దేశవ్యాప్తంగా ఉన్న లబ్దిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం 11వ విడతలో భాగంగా రూ. 21 వేల కోట్ల నిధులను ప్రధానమంత్రి నరేంద్రమోడి వర్చువల్ ద్వారా రైతుల ఖాతాల్లోకి జమ చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి వెన్నుముక అయిన రైతు క్షేమంగా ఉంటేనే రాజ్యం సుభిక్షంగా ఉంటుందని ప్రధాని నరేంద్రమోడి అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన గరీబ్ కళ్యాణ్ సమ్మేళన్ కార్యక్రమం లో జిల్లా కలెక్టరు పి. కోటేశ్వర రావు, జాయింట్ కలెక్టరు రామ సుందర్ రెడ్డి,,డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, డిపివో నాగరాజు నాయుడు, హౌసింగ్ పిడి వెంకటనారాయణ, వ్యవసాయ శాఖ జెడి వరలక్ష్మి, డిఆర్డిఎ పిడి వెంకటేశులు, పంచాయతీరాజ్ ఎస్ ఈ పాండురంగ మూర్తి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కర్నూలు జిల్లా కలెక్టరు పి.కోటేశ్వర రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు చక్కగా వినియోగించుకుని అభివృద్ధి చెందాలన్నారు. పియంకిసాన్ పథకం కింద ఈ రోజు 2 వేల రూపాయలు చొప్పున దేశవ్యాప్తంగా 21 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాలకు బదిలీ చేస్తుండగా కర్నూలు జిల్లాకు సంబంధించి 2.54 లక్షల మంది రైతుల ఖాతాలకు రూ. 50.86కోట్ల సాయం విడుదల చేయడం జరిగిందన్నారు. వివిధ పథకాల అమల్లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మద్యదళారీలకు తావులేకుండా పారదర్శకంగా లబ్దిదారుల బ్యాంకు ఖాతాలకే నేరుగా డిబిటి విధానంలో ఆయా పథకాల నిధులు జమచేయడం జరుగుతుందన్నారు.

# ఊరిస్తుందనుకున్న సోనాల్ ఉసూరుమనిపించిందే!

తెలుగు తెరపై గ్లామరసాన్ని ఒలికించిన కథానాయికలలో సోనాల్ చౌహాన్ ఒకరు. ఒక వైపున బాలీవుడ్ సినిమాలు చేస్తూనే .. మరో వైపున అవకాశాన్ని బట్టి తెలుగు సినిమాల్లోను మెరుస్తోంది. మధ్యలో ఏ మాత్రం కాస్త గ్యాప్ దొరికినా హాట్ ఫోటోలను పోస్టు చేస్తూ కుర్రాళ్ల మతులు గతులు తప్పేలా చేస్తుంటుంది. అందువల్లనే ఆమె వరుస సినిమాలు చేయకపోయినా ప్రేక్షకులకు గుర్తుంది. తెలుగులో ఇంతవరకూ ఆమె బాలకృష్ణ సినిమాల్లోనే ఎక్కువగా చేసింది. బాలయ్యతో ఆమె చేసిన సినిమాల జాబితాలో 'లెజెండ్' .. 'డిక్టేటర్' .. 'రూలర్' కనిపిస్తాయి.ఫలానా సినిమాలో సోనాల్ ను తీసుకున్నారనేగాని అది గ్లామర్ వైపునుంచి అనుకుంటారు తప్పా ఏదో కీలకమైన పాత్ర ఇచ్చి ఉంటారని మాత్రం అనుకోరు. ఎందుకంటే సోనాల్ ఇంతవరకూ చేసింది గ్లామరస్ పాత్రలే .. ఆమెకి తెలిసింది కూడా అందాలను ఆరబోయడమే.బరువైన పాత్రలను పోషించాలని సోనాల్ అనుకోవడం లేదు .. ఆమెను అలాంటి పాత్రలలో చూడాలని ఆడియన్స్ ఆశపడటం లేదు. ఆమె గ్లామరస్ పాత్రలలో కనుల పండుగ చేయాలనే కుర్రాళ్లు ఆశిస్తున్నారు .. ఆరాటపడుతున్నారు.అలా 'ఎఫ్ 3' సినిమా కోసం సోనాల్ ను తీసుకున్నారని తెలియగానే కుర్రాళ్లకు ప్రాణం లేచొచ్చింది. ఒక వైపున తమన్నా తళుకులు .. మరో వైపున మెహ్రీన్ మెరుపులు ఎలా తట్టుకోవాలా అనుకుంటూ ఉంటే బోనస్ గా సోనాల్ సొగసుల్ కూడా పలకరించనున్నాయి అనేసరికి కుర్రాళ్లంతా నాలుక అరిగిపోయేలా చప్పరించేశారు.సినిమా మొదలైన దగ్గర నుంచి సోనాల్ ఎప్పుడు .. ఎక్కడ .. ఎలా ఎంట్రీ ఇస్తుందా అని వెయిట్ చేశారు. అంతలో సోనాల్ రానే వచ్చింది .. కానీ ఆమె నుంచి ఎలాంటి సొగసుల సందడి లేదు .. అందాల హడావిడి లేదు.సోనాల్ వెంకటేశ్ కలిసి హుషారెత్తిస్తుందా? వరుణ్ తేజ్ తో కలిసి పిచ్చెక్కిస్తుందా? అనుకుంటే ఆమె కాస్తా జెంట్ గెటప్ లో ఉన్న తమన్నాకి లైనేసి తన కోసం కేటాయించిన ఒక్క పాటను తమన్నాతో పాడుకుని వెళ్లిపోయింది. అక్కడ కామెడీ వర్కౌట్ అయింది ... కుర్రాళ్ల రొమాంటిక్ ఆలోచనలు కూడా తలక్రిందులయ్యాయి. అలా ఉత్సాహంతో ఉన్న పిలగాళ్లను సోనాల్ ఉసూరుమనిపించింది. ఇక పూజ హెగ్డే నేనేమైనా తక్కువ తిన్నానా అన్నట్టుగా సమయం సందర్భం లేకుండా వచ్చేసి .. ఒక పాటకి స్టెప్పులేసి సెలవు తీసుకుంది. ఏదేమైనా ఈ అందగత్తెలను అస్సలు నమ్మకూడదబ్బా!



# 'ఉప్పెన' డైరెక్టర్ కోసం సుక్కు మ్యాజిక్ చేయాల్సిందేనా?

టాలీవుడ్ లో అగ్ర దర్శకుల వద్ద అసోసియేట్ లుగా వర్క్ చేసిన వారు దర్శకులుగా విజయాలు సాధించిన సందర్భాలు చాలా తక్కువే. గతంలో దాసరి నారాయణరావు కె. రాఘవేంద్రరావుల వద్ద దర్శకత్వ శాఖలో పని చేసిన చాలా మంది ఆ తరువాత దర్శకులుగా మారి సక్సెస్ అయ్యారు. కానీ నేటి తరం స్టార్ డైరెక్టర్ ల వద్ద దర్శకత్వ శాఖలో సహాయకులుగా పని చేసిన వారు దర్శకులుగా సక్సెస్ కావడం లేదు. ఆ సంఖ్య చాలా తక్కువగా వేళ్లపై లెక్కపెట్టే విధంగా వుంటోంది.నేటి తరం టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ లు రాజమౌళి త్రివిక్రమ్ సుకుమార్ బోయపాటిల వద్ద సహాయకులుగా పని చేసిన వాళ్లు ఆ తరువాత దర్శకులుగా ప్రయత్నాలు చేసి సక్సెస్ కాలేకపోతున్నారు. తను వర్క్ చేసిన దర్శకుడి కారణంగా తొలి చిత్రాన్ని డైరెక్ట్ చేసే అవకాశాన్ని సొంతం చేసుకుని సక్సెస్ సాధించినా సరే రెండవ సినిమాకు వచ్చే సరికి మళ్లీ ఆపసోపాలు పడుతున్నారు. రెండవ సినిమాని పట్టుకునే క్రమంలో కొంత కన్ఫ్యూజన్ కు గురవుతున్నారు.స్టార్ డైరెక్టర్ సుకుమార్ వద్ద అసోసియేట్ లుగా వర్క్ చేసిన వాళ్ల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. తొలి చిత్రాన్ని సుకుమార్ తనే స్వయంగా నిర్మాతగా సపోర్ట్ చేస్తూ అవకాశం ఇచ్చినా రెండవ సినిమాని పట్టుకునే క్రమంలో సుకుమార్ అసోసియేట్ లు తడబడుతున్నారు. ఆ మధ్య 'కరెంట్' మూవీని రూపొందించిన సుకుమార్ అసోసియేట్ పల్నాటి సూర్య ప్రతాప్ రెండవ సినిమాని పట్టుకోవడానికి దాదాపు ఆరేళ్లు పట్టింది. ఆ మూవీని స్వయంగా సుకుమారే నిర్మించడం గమనార్హం.ఆరేళ్ల విరామం తరువాత పల్నాటి సూర్య ప్రతాప్ దర్శకత్వంలో సుకుమార్ నిర్మించిన చిత్రం 'కుమారి 21 ఎఫ్'. ఈ మూవీ హిట్ అనిపించుకున్నా అతనికి ఇప్పటి వరకు మరో సినిమా లేదు. ఇక ఇటీవలే తన మరో అసోసియేట్ బుచ్చిబాబు సానా 'ఉప్పెన' సినిమాతో దర్శకుడిగా పరిచయం అయ్యాడు. సినిమా బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. మైత్రీ మూవీ మేకర్స్ సుకుమార్ తో కలిసి ఈ మూవీని నిర్మించారు. వంద కోట్ల క్లబ్ లో చేరిన ఈ మూవీ తరువాత బుచ్చిబాబు మరో భారీ ప్రాజెక్ట్ ని చేయాలని ప్లాన్ చేసుకున్నాడు.అదీ యంగ్ టైగర్ ఎన్టీఆర్ తో. శ్రీకాకుళం నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ డ్రామాగా ఈ మూవీని తెరపైకి తీసుకురావాలని ప్లాన్ చేశాడు. అయితే ఎన్టీఆర్ ఇటీవల తన పుట్టిన రోజు సందర్భంగా మే 20న తన 30 31 ప్రాజెక్ట్ లని అధికారికంగా ప్రకటించాడు. ఇదే తరహాలో బుచ్చిబాబు ప్రాజెక్ట్ ని కూడా అధికారికంగా ప్రకటిస్తారని అంతా ఎదురుచూశారు కానీ అది జరగలేదు. కారణంగా పూర్తి స్థాయిలో బుచ్చిబాబు కథని నెరేట్ చేయలేదని తెలుస్తోంది. ఒక వేళ కథ పూర్తిగా సిద్ధం చేసినా ఎన్టీఆర్ తో సినిమా అంటే మరో రెండేళ్లు ఆగక తప్పని పరిస్థితి.దీంతో రెండవ సినిమా విషయంలో మళ్లీ సుక్కు మ్యాజిక్ చేస్తే కానీ వర్కవుట్ అయ్యేలా కనిపించడం లేదని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి.

# పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ దిల్ మాంగే మోర్

ఇటీవల స్టార్ హీరోలు భారీ డిజాస్టర్ లని చూసిన విషయం తెలిసిందే. ప్రేక్షకులతో పాటు ఫ్యాన్స్ కూడా ఈ చిత్రాలతో తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. దీంతో ఎలాగైనా మళ్లీ ట్రాక్ లోకి రావాలని అంతకు మించిన ఎంటర్ టైన్ మెంట్ తో పాటు యాక్షన్ ట్రీట్ ని అభిమానులకు ప్రేక్షకులకు అందించాలని స్టార్ హీరోలు ప్లాన్ చేస్తున్నారు. ఇటీవల 'రాధేశ్యామ్' మూవీతో భారీ డిజాస్టర్ ని ఎదుర్కొని ఫ్యాన్స్ కి షాకిచ్చిన ప్రభాస్ తన తదుపరి చిత్రంతో యాక్షన్ ట్రీట్ ఇవ్వాలనుకుంటున్నాడట.ప్రస్తుతం ప్రభాస్ 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న హైవోల్టేజ్ యాక్షన్ ఎంటర్ టైనర్ లో నటిస్తున్న విషయం తెలిసిందే. హోంబలే ఫిలింస్ బ్యానర్ పై 'కేజీఎఫ్' ప్రొడ్యూసర్ విజయ్ కిరగందూర్ ఈ మూవీని అత్యంత భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 'కేజీఎఫ్' సిరీస్ మూవీస్ తరహాలోనే మైన్స్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ మూవీపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'బాహుబలి' తరువాత 'సాహో' పరవాలేదనిపించినా 'రాధేశ్యామ్' ఊహించని విధంగా డిజాస్టర్ గా నిలవడంతో ప్రభాస్ ఆశలన్నీ 'సలార్'పైనే పెట్టుకున్నాడట.ప్రస్తుతం ఆదిపురుష్ ప్రాజెక్ట్ కె వంటి చిత్రాల్లో నటిస్తున్నా తన దృష్టి మాత్రం ఎక్కువగా 'సలార్'పైనే వుందని తెలుస్తోంది. 'కేజీఎఫ్'లో యాక్షన్ సీక్వెన్స్ లు యష్ కి ప్రశాంత్ నీల్ ఇచ్చిన బిల్డప్.. యష్ స్వాగ్ ఓ రేంజ్ లో పేలాయి. అలాంటి సీన్ లే తనకు కావాలని మోర్ యాక్షన్ సీన్స్ తో ఫ్యాన్స్ కి ట్రీట్ ఇవ్వాలని ప్రభాస్ అడుగుతున్నాడట. అయితే ఇటీవల 'సలార్' షూటింగ్ లో జరిగిన ప్రమాదం కారణంగా ప్రభాస్ కు మోకాలికి శస్త్ర చికిత్స జరిగింది.అలాగే వెన్నుకు సంబంధించిన మైనర్ సర్జరీ కూడా జరిగింది. ఈ రెంగు విషయాలని దృష్టిలో పెట్టుకుని మోర్ యాక్షన్ కంటే బిల్డప్ షాట్స్ స్వాగ్ సీన్స్ తో సరిపెట్టేద్దామని ప్రశాంత్ నీల్ చెబుతున్నారట.అయితే నాకు వచ్చిన ప్రాబ్లమ్ ఏమీ లేదని ఇంటెన్స్ యాక్షన్ సీన్ లని మరింతగా పెంచితే బాగుంటుందని ప్రభాస్ కోరుతున్నాడట.




# ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడలేదు.. కానీ రెండు టైటిల్స్.. ఐపీఎల్‌లో మోస్ట్ లక్కీ ప్లేయర్..!

టీమిండియా స్పిన్నర్ కరణ్ శర్మకు ఐపీఎల్‌లో అత్యంత అదృష్టవంతమైన ఆటగాడిగా పేరుంది. అతడు ఏ జట్టులో ఉంటే ఆ జట్టుదే టైటిల్ అని అంతా భావిస్తారు. గత ఐదు సీజన్‌లలో మూడు సార్లు ఛాంపియన్స్‌గా నిలిచిన జట్టులో సభ్యుడిగా కరణ్ శర్మ ఉన్నాడు. అయితే ఈ సారి మాత్రం అతడి అదృష్టం ఆర్సీబీకి కలిసి రాలేదు. ఐపీఎల్-2022లలో ఆర్సీబీకి కరణ్ ప్రాతినిధ్యం వహించాడు.ఈ ఏడాది సీజన్‌లో ఆర్సీబీ ప్లే ఆఫ్‌లోనే ఇంటిముఖం పట్టింది. ఇది ఇలా ఉండగా.. ఐపీఎల్‌లో కరణ్ శర్మ కంటే అదృష్టవంతమైన మరో ఆటగాడు ఉన్నాడు. అతడే వెస్టిండీస్ యువ పేసర్ డొమినిక్ డ్రాక్స్. కరణ్ శర్మ కనీసం ఒకటో,రెండో మ్యాచ్‌లు ఆడి టైటిల్స్ గెలిస్తే.. డ్రాక్స్ మాత్రం ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడకుండా రెండు సార్లు ఛాంపియన్స్‌గా నిలిచిన జట్టులో భాగమయ్యాడు.ఐపీఎల్-2021లో చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించిన డ్రాక్స్‌కు ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడే అవకాశం రాలేదు. అయితే గతేడాది ఛాంపియన్స్‌గా సీఎస్‌కే నిలిచింది. అదే విధంగా ఐపీఎల్-2022లో గుజరాత్ టైటాన్స్ తరపున ఆడిన డ్రాక్స్.. అన్నీ మ్యాచ్‌లకు బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఈ ఏడాది సీజన్‌లో గుజరాత్ టైటాన్స్? విజేతగా నిలిచింది.




## వెస్టిండీస్ క్రికెట్ సెలక్టర్ రాజీనామా! కారణం?

వెస్టిండీస్ మాజీ బ్యాటర్ రామ్‌నరేశ్ శర్వాన్ సెలక్టర్ పదవికి రాజీనామా చేశాడు. జాతీయ సెలక్టర్ బాధ్యతల నుంచి తప్పుకొన్నాడు. వ్యక్తిగత కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించాడు. ఈ విషయాన్ని వెస్టిండీస్ క్రికెట్ బోర్డు ధ్రువీకరించింది.ఈ మేరకు.. "పురుషుల సీనియర్, యువ విభాగానికి క్రికెట్ సెలక్టర్‌గా ఉన్న రామ్‌నరేశ్ శ?ర్వాన్ వ్యక్తిగత కారణాల వల్ల తన పదవి నుంచి వైదొలిగారు. జనవరి 6, 2022లో ఆయన నియామకం జరిగింది. అయితే, ఇకపై ఆయన ఈ పదవిలో కొనసాగరని క్రికెట్ వెస్టిండీస్ తెలియజేస్తోంది"

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**